ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 27.0

ఇద్దరికి కొవిడ్ పరీక్షలు

» నెగిటివ్ రిపోర్టు

ఏలూరు అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : కొవిడ్-19 వైరస్ లక్షణాలతో శనివారం ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వచ్చిన ఇద్దరి నుంచి శ్వాబ్‌లను సేకరించి రాపిడ్ కిట్లతో టెస్టులు చేశారు. ఆసుపత్రిలోని ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌లో నిర్వహించిన పరీక్షల్లో వారికి నెగిటివ్ రిపోర్టు వచ్చిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడిం చాయి. మాస్కులు ధరించడం, చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం, జనసమ్మర్థ ప్రాంతాల్లో సమూహాలుగా ఉండకపోవడం, వృద్ధులు, గర్భిణులు ఇంటివద్దే ఉండడం, తదితర ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వైద్యవర్గాలు సూచించాయి.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి : కలెక్టర్


టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడు తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలపై పూర్తి చేయాలని, బిల్లుల మంజూరు విషయంలో ఎక్కడైనా అవినీతికి ఆస్కారం ఇచ్చినట్లే తేలితే ఆ ఉద్యోగులను విధుల నుంచి తొలగించేందుకు వెనకాడేది లేదని కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరించారు. కలెక్టరేట్ నుంచి ఆమె శనివారం గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది, వార్డు ఎమెనిటీస్‌తో ఇళ్ల పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు. నూజివీడు డివిజన్‌లోని మండలాల ప్రగతిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే వారంలో 465 ఇళ్లను పూర్తి చేయడానికి ఇంజనీరింగ్ అధికారు లు క్షేత్రస్థాయిలో సందర్శించాలన్నారు. హౌసింగ్ పీడీ సత్యనారాయణ, ఈఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

27న ఐదు వేల మందితో యోగా

ఏలూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణలో భాగంగా ఈ నెల 27న ఐదువేల మందితో యోగా కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ఏలూరు మున్సిపల్ కమిషనర్, డీఆర్‌డీఏ పీడీ, డీసీవో, ఆయుష్ అధికారులను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. దీనికి యోగా శిక్షకులను, వేదిక ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 29 నుంచి జూన్ 5,11,18వ తేదీల్లో పర్యాటక ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలకు కార్యచరణను రూపొందించాలని ఐటీడీఏ పీవో, పర్యాటకశాఖ జిల్లా మేనేజర్‌లను ఆదేశించారు. యోగాంధ్ర మహోత్సవాల్లో భాగంగా గ్రామ, వార్డు స్థాయిల్లో యోగా ఫర్ ఆల్, మండల స్థాయిలో యూనిట్ త్రో యోగా, జిల్లా స్థాయిలో యోగా అండ్ యూత్ ఇతివృత్తాలతో పోటీలు నిర్వహించాలని జిల్లా నైపుణ్యాధికారికి సూచించారు. ఈనెల 26 నుంచి 30 వరకు గ్రామ,వార్డు స్థాయిలో, జూన్ 2 నుంచి 7 వరకు మండల స్థాయిలో, 9 నుంచి 14 వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించాలన్నారు.

మార్పువైపు.. అడుగులు!


పట్టాయిగూడెం పారిశ్రామికవాడ ఏర్పాటు ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్ పనులు

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

» సుదీర్ఘకాలం తర్వాత పారిశ్రామిక వాడలు
» పట్టాయగూడెం, తోటపల్లిలో ఇక వెలుగులు
» ఉపాధి కల్పించే దిశగా కీలక నిర్ణయాలు
» హామీల అమలులో టీడీపీ కొత్త ఒరవడి

తెలుగుదేశం ప్రభుత్వంలో గతంలో కంటే భిన్నంగా స్పష్టతతో మార్పు వైపు శరవేగంగా కదులుతున్నారు. జిల్లాలో అంబేద్కర్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వ్యవసాయరంగంలో కోకో పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా సీఎం చంద్రబాబు వ్యవ సాయ మంత్రిని పంపి తక్షణ నిర్ణయాలు తీసుకునేలా చేశారు. చింతలపూడి, ఆగిరిపల్లిలో పారిశ్రామికీకరణ జరిగేలా కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

- ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి

అనుకున్నది.. అనుకున్నట్టుగా..

పాలనా పగ్గాలు చేపట్టి ఏడాది లోపే కొత్త మార్పు చూపిస్తామని ముందుగానే చెప్పినట్టుగానే ఆ దిశగానే వేగంగా ముందుకు కదులుతున్నారు. అమరావతికి సమీపాన ఉన్న ఏలూరులో వేగంగా అభివృద్ధి జరగాలంటే ఆ దిశగా విద్యారంగానికి ఊతం ఇవ్వాలి. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం ద్వారా తెలుగుదేశం ప్రభుత్వం అదే చేసింది. పొరుగున్న ఉన్న పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటికే నిట్‌తో పాటు హార్టికల్చర్ యూనివర్సిటీ, ఆక్వా యూనివర్సిటీకి అవకాశం ఇచ్చింది. కానీ ఏలూరు జిల్లాకు గత ఐదేళ్లలో ఎక్కడా పురోగతి లేకుండా పోయింది. అంబేడ్కర్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతానికి మరింత వన్నె తెచ్చే అవకాశం ఉంది. ఏడాదికి ఈ యూనివర్సిటీ పరిధిలో 70 నుంచి 80 వేల మంది ప్రవేశాలు పొందుతారు. వివిధ స్టడీ సెంటర్ల ద్వారా ఈ ప్రవేశాలుంటాయి. వాస్తవానికి ఏపీ నిట్ ఏర్పాటు దిశగా ఏలూరు శివారు వట్లూరు పరిధిలో భూమిని అప్పట్లో సిద్ధం చేశారు. కానీ కొన్ని కారణాల చేత నిట్ తాడేపల్లిగూడెంకు తరలిపోయింది. ఆ లోటును వివిధ వేదికలపై ఏలూరు వాసులు పదేపదే గుర్తుచేసే వారు. తెలుగుదేశం ప్రభుత్వం ఇప్పుడు చొరవ తీసుకుని యూనివర్సిటీ ఏర్పాటు నిర్ణయం కారణంగా అసంతృప్తిని తగ్గించినట్లైంది. ఇప్పటికే ఏలూరు నగరంలో ఇంజనీరింగ్ కళాశాలలు కొంత పుంజుకోగలిగాయి. భవిష్యత్తులో రాజధానికి అత్యంత దగ్గరగా ఉన్న నగరాల్లో ఏలూరు ఒకటి కాబోతుంది. కాబట్టి ఇప్పటి నుంచే ఒక్కొక్కటిగా ఈ ప్రాంతానికి గుర్తింపు వచ్చేలా నిర్ణయాలు జరుగుతున్నాయి.

కోకో రైతుకు బాసట

మెట్టలో ఉద్యానవన పంటలు అందించేందుకు గత రెండు దశాబ్దాల్లో ఈ ప్రాంత రైతులు ఎంతో శ్రమించారు. ఆయిల్‌పామ్ విస్తీర్ణంలో రికార్డు సృష్టించగా, సమాంతరంగా కోకో పంటను సాగుచేసి అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ ప్రాంతానికి ఒక గుర్తింపునకు కారణమయ్యారు. కానీ రానురాను మిగతా మార్కెట్ల మాదిరిగానే కోకో మార్కెట్ పూర్తిగా దెబ్బతింది. కిలో రూ.450కి మించి తాము కొనుగోలు చేయలేమని కంపెనీలు భీష్మించాయి. రైతులు తమకు రూ.550 చెల్లిస్తేనే గిట్టుబాటు అవుతుందని పట్టుబట్టడంతో ప్రతిష్టంభన నెలకొంది. దీనిపై సీఎం చంద్రబాబు దృష్టి పెట్టి ఉన్నతాధికారులతో సహా, మంత్రి అచ్చెన్నను ఏలూరుకు పంపి రైతులు, కంపెనీ ప్రతినిధులతో ముఖాముఖి చర్చించేలా చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో 'చాక్లెట్' అమ్మకాలు అత్యంత దారుణంగా పడిపోవడంతో ప్రముఖ కంపెనీలన్నీ చాక్లెట్‌ల తయారీని తగ్గించేశాయి. దీంతో వీటి తయారీకి ఉపయోగించే కోకోకు గండం వచ్చి పడింది. కంపెనీలు ఇస్తామన్న రూ.450, రైతులు కోరుకుంటున్న రూ.550 కాకపోయినా మధ్యేమార్గంగా కిలో రూ.500లకు కొనుగోలు చేసేలా కంపెనీలను ఒప్పించే ప్రయత్నం చేశారు. జిల్లాలో ఒక పంటకు మార్కెట్‌లో ఇబ్బందులు వచ్చినప్పుడు పరిష్కారం కోసం మంత్రితో పాటు ఉన్నతాధికారులను రంగంలోకి దింపి చర్చించడం ఇదే ప్రథమం. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ కారణం గానే వీలైతే రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వ పరంగా రూ.50 అదనంగా సమకూర్చే దిశగా చర్చ సాగడం విశేషం.

పారిశ్రామికీకరణ పై దృష్టి

మెట్ట ప్రాంతంలో జీవనోపాధి పెరగాలంటే చిన్న, పెద్దా పరిశ్రమలు రావాల్సిందే. పారిశ్రామిక రాయితీలు పెంచినా, పెట్టుబడులకు అవకాశాలు కల్పించినా, శరవేగంగా అనుమతిలిచ్చినా పారిశ్రామిక వేత్తలు ఎవరూ ఈ వైపు తొంగి చూడలేదు. ఐదేళ్ల జగన్ జమానాలో కేవలం పెదవేగి మండలంలోను మొక్కజొన్న ఫ్యాక్టరీలు పెద్ద సంఖ్యలో ఏర్పడ్డాయి. ఆ కంపెనీలు రావడంలో జగన్ ప్రభుత్వ కృషి అంటే ప్రత్యేకంగా లేనేలేదు. ఇంతకుమించి ఎక్కడా పారిశ్రామికీకరణ జరగలేదు. కానీ ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చింతలపూడి నియోజకవర్గంలోని పట్టాయిగూడెంలో ఏపీఐఐసీ నేతృత్వంలో 69.5 ఎకరాల్లో పారిశ్రామిక వాడ ఏర్పాటుకు పునాది రాయి వేశారు. పోలవరం నిర్వాసితులకు కనీసం ఉపాధి కల్పించే వనరులు ఎక్కడ లేనే లేవు. చింతలపూడి నియోజకవర్గ వాసులకు ఉపాధి చూపిద్దామంటే ఇప్పటికీ అదీ సాధ్యం కాలేదు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఏర్పాటు చేస్తేనే సాధారణ, మధ్యతరగతి కుటుంబాలకు వెసులుబాటు కలుగుతుంది. ఇప్పుడు అదే దిశగా తెలుగుదేశం ప్రభుత్వం పారిశ్రామికవాడ వైపు మొగ్గు చూపింది. ఇంకోవైపు ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోను బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు మంత్రివర్గం ఈ మధ్యనే పచ్చజెండా ఊపింది. రూ.150 కోట్ల వ్యయంతో సుమారు 500 మందికి ఉపాధి కల్పించే దిశగా అడుగులు కదిపారు. ఒకే నెలలో రెండు కీలక నిర్ణయాలు తీసుకోవడం ద్వారా పాలనలో మార్పు చూపించారు. సాధ్యమైనంత మేర క్షేత్రస్థాయిలో ఈ పనులన్నీ పూర్తి చేసి ఉపాధికి ఊతం ఇస్తే వందల కుటుంబాల్లో వెలుగులు నిండుతాయి.


వయ్యారి భామ.. నీ హంస నడక

వయ్యారి భామలు హోయలొలికించే నడకలతో, తమ అందచందాలతో చూపరులను కట్టిపడేశారు. ఏలూరులో శనివారం నిర్వహించిన ఫ్యాషన్ షో అలరించింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన మోడల్స్ క్యాట్ వాక్‌తో ఆకట్టుకున్నారు.

సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతం

ఏలూరు అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన బయోలాజికల్ సైన్సు పరీక్షకు జిల్లాలో 4,306 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3,016 మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య ఇంటర్మీడియట్ జీవశాస్త్రం పరీక్షకు 21 మందికి 15, వాణిజ్యశాస్త్రం పరీక్షకు 64 మందికి 55 మంది విద్యార్థులు హాజర య్యారని వివరించారు.

ఈఏపీ సెట్‌కు 474 మంది హాజరు

ఈఏపీ సెట్‌లో భాగంగా ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు శనివారం జరిగిన ఆన్‌లైన్ పరీక్షకు స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో 157 మంది విద్యార్థులు, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కేంద్రంలో 144, సీఆర్ ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 173 మంది హాజరయ్యారు. మొత్తంమీద 15 మంది గైర్హాజరయ్యారు.

సహకార బదిలీలపై కసరత్తు

■ లోపలి పేజీలో..

ఒక్కరోజులోనే..



» హెల్త్ అసిస్టెంట్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్ మార్గదర్శకాలకు తూట్లు
» హడావుడి నిర్ణయాలు .. అంతలోనే దిద్దుబాటు చర్యలతో తడబాటు
» జిల్లా వైద్యఆరోగ్యశాఖ వర్గాల నిర్వాకం

ఏలూరు అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఎంపీహెచ్ఏ (మేల్) ఉద్యోగుల సేవలను మలేరియా, డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో వినియోగించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన కౌన్సెలింగ్ ప్రక్రియ, మార్గదర్శకాలకు తూట్లు పొడిచేలా జిల్లా వైద్యఆరోగ్యశాఖలో శనివారం ఒక్కరోజులోనే పలు పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వం గతనెల 16న విడుదల చేసిన జీవో ప్రకారం ఇప్పటికే కొన్ని జిల్లాల్లో హెల్త్ అసిస్టెంట్ల సర్దుబాటుకు కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగియగా, ఇక్కడ ఇంతవరకు ఆ దిశగా కనీస ప్రక్రియను ప్రారంభించకుండానే ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి వస్తోందంటూ శనివారం ఒక్కరోజులోనే జిల్లాలోని హెల్త్ అసిస్టెంట్ల సీనియార్టీ జాబితాను విడుదల చేయడం, అందులో తప్పులు ఉన్నాయంటూ పలువురు ఫిర్యాదులు చేయడం, దీనికిముందే ఆది, సోమవారాల్లోనే కౌన్సెలింగ్ అంటూ సమాచారాన్ని వ్యాప్తి చేయడం, అంతలోనే జాబితాల్లో ఇంకా ఎవరి పేర్లనైనా చేర్చేందుకు లేదా మార్పు చేర్పులకు పీహెచ్‌సీల యూడీసీలకు సర్క్యులర్‌ను జారీ చేయడం, చివరకు కౌన్సెలింగ్‌ను చేపట్టడానికి ముందుగా పాటించాల్సిన మార్గదర్శకాలను గాలికొదిలేయడం వంటివి వెలుగులోకి రావడం, తదితర వరుస పరిణామాలతో డీఎంహెచ్‌వో కార్యాలయం అధికార వర్గాలు ఉక్కిరిబిక్కిరయ్యాయి. దొడ్డిదారిన పలువురు అనర్హులకు రీడిప్లాయిమెంట్/వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్‌లో లబ్ధి చేకూర్చేందుకే కార్యాలయ అధికారులు, సంబంధిత ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం అడ్డదారులు తొక్కిందని ఓ ప్రచారం జరుగుతుండగా, ఈ హడావుడి వ్యవహారం వెనుక కొందరు అనర్హులు కార్యాలయ వర్గాలకు డబ్బులిచ్చి కౌన్సెలింగ్‌లో మిగతా వారికంటే ముందుండేలా చక్కబెట్టడాన్ని కాదనలేమని మరో ప్రచారం కూడా ఉంది.

సర్దుబాట్లు.. అక్రమ చొరబాట్లు?!

అసలు కథేంటి ..?

మలేరియాను సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంతో పీహెచ్‌సీలు, సబ్ సెంటర్ల సచివాలయాల్లో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో పనిచేస్తున్న ఎంపీహెచ్ఏ (మేల్) ఉద్యోగుల సేవలను మలేరియా, డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల తీసుకున్న నిర్ణయం ప్రకారం వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా కీటకజనిత వ్యాధులవ్యాప్తి నియంత్రణ కార్యక్రమం (ఎన్‌వీబీడీసీపీ)లో వీరికి విధులు కేటాయించేందుకు మార్గదర్శకాలను గతనెల 16న విడుదల చేశారు. ఆ ప్రకారం తొలి ప్రాధాన్యతగా మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో రెండు నుంచి నాలుగు సచివాలయాలకు కలిపి ఒక ఎంపీహెచ్ఏ, ఆ తర్వాత అధికంగా డెంగీ వ్యాప్తిచెందే పట్టణ ఆరోగ్యకేంద్రాలకు ఒకరు చొప్పున, గ్రామీణ ప్రాంతాల్లో డెంగీ కేసులు వ్యాప్తి చెందే ప్రాంతాల్లో 2-4 సచివాలయాలకు కలిపి ఒకరు చొప్పున ఎంపీహెచ్ఏ (మేల్) ఉద్యోగులను సర్దుబాటు చేయాలని సూచించారు. ఇంకా ఉద్యోగులు మిగిలిపోతే జాతీయ ఫైలేరియా కంట్రోల్ ప్రోగాం సబ్ యూనిట్‌లలో, జిల్లా మలేరియా యూనిట్లలో సర్దుబాటు చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఆ మేరకు ఉమ్మడి జిల్లాలోని 48 మండలాల ప్రాతిపదికన సుమారు 400 మంది ఎంపీహెచ్ఏ (మేల్) రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులను కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా మెరిట్ కం రోస్టర్ పాయింట్ల జాబితాను పాటిస్తూ సర్దుబాటు చేయాల్సి ఉంది. ఈ మొత్తం నియామకాల్లో మెరిట్ జాబితాలో తామున్నామని గతంలో కోర్టుకెళ్లి ప్రస్తుతం ఉద్యోగాల్లో కొనసాగుతున్న సుమారు 40 మంది ఉద్యోగులకు కౌన్సెలింగ్‌లో లబ్ధి చేకూరేలా శనివారం ఒక్కరోజులోనే సర్దుబాటు ప్రక్రియను తెరపైకి తెచ్చిన వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు కొందరు కౌన్సెలింగ్ నిర్వహణకు ముందు జరగాల్సిన సీనియార్టీ జాబితాల ప్రదర్శన, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం, తుది సీనియార్టీ జాబితాల విడుదల అనంతరమే అందుబాటులోవున్న వెకెన్సీలను సర్దుబాటుపై భర్తీ చేయాల్సి ఉంది. ఇవేవీ లేకుండానే హడావుడిగా ఓ జాబితాను విడుదల చేసి ఆది, సోమ వారాల్లోనే కౌన్సెలింగ్‌కు సన్నాహాలు చేయడంతో లొసుగులు బయటకు వచ్చాయి. గతేడాది రెగ్యులరైజేషన్ అయినవారిలో కొందరికి ఆర్డర్లు వచ్చేసరికి అసెంబ్లీ ఎన్నికల కోడ్ అడ్డంకి కావడంతో జిల్లాలో పలువురుని మెరిట్ జాబితాలో వెనక్కి నెట్టేశారని, తమకు న్యాయం చేయాల్సిందిగా డీఎంహెచ్‌వో డాక్టర్ మాలినిని శనివారం ఉద్యోగులు కొందరు కలిసి ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన డీఎంహెచ్‌వో కార్యాలయం సరిదిద్దుకునే ప్రయత్నం చేయకుండానే తాజాగా మరో తప్పటడుగు వేసింది. ఉమ్మడి జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల వారీగా ఎంపీహెచ్ఏ(మేల్) ఉద్యోగులు ఇంకా ఎవరైనా ఉంటే వారి నియామక వివరాలు, మెరిట్, తదితర వివరాలన్నీ వెంటనే పంపాలని ఆదేశించింది.

మెరిట్ కం రోస్టర్ పాయింట్ల జాబితా ఎక్కడ?

వాస్తవానికి ఏటా ఆయా కేడర్ల వారీగా నియామకాలు, వాటిలో పనిచేస్తున్న ఉద్యోగులు, వారికి మెరిట్ కం రోస్టర్ పాయింట్లు, ప్యానెల్ సంఖ్య తదితర సమగ్ర వివరాలన్నీ డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాల వద్ద భద్రంగా ఉంచాలి. ఇపుడు చేపడుతున్న సర్దుబాటు ప్రక్రియకు హెల్త్ అసిస్టెంట్ల వివరాలను పంపాల్సిందిగా పీహెచ్‌సీల మీద ఆధార పడుతుండటాన్ని గమనిస్తే మెరిట్ కం రోస్టర్ పాయింట్ల జాబితా ఉందా..? లేదా..? పీహెచ్‌సీల నుంచి ఇచ్చే మెరిట్ సమాచారంలో విశ్వసనీయత ఎంత..? అనే సందేహాలు నెలకొన్నాయి. దీనిపై డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని వివరణ కోసం శనివారం రాత్రి ఫోన్‌లో ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద్‌ను వివరణ కోరగా 'సీనియార్టీ జాబితాలపై ఉద్యోగుల నుంచి అభ్యంతరాలను స్వీకరించడం, వాటిని పరిష్కరించడం, కౌన్సెలింగ్ నిర్వహించి పనిస్థానాలను కేటాయించడం సోమవారం ఒక్కరోజులోనే ఎంత ఆలస్యమైనా పూర్తి చేయడానికి ప్రయత్నిస్తాం. ఏ ఒక్క ఉద్యోగికీ అన్యాయం జరుగదు' అని వివరించారు.

రుణాలకు బ్రేక్!

» భారీగా వచ్చి పడిన దరఖాస్తులు
» అత్యధికులకు పథకం దక్కని పరిస్థితి
» యూనిట్ల సంఖ్య పెంచే యోచన
» ఒకేసారి లబ్ధిదారుల ఎంపిక

ఏలూరు రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన వర్గాలకు మరోసారి నిరాశ తప్పలేదు. ఎస్సీ, బీసీ, ఈబీసీల్లోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పనకు సబ్సిడీ రుణాలు అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే ఆ ప్రక్రియను ఎక్కడికక్కడ తాత్కాలికంగా నిలిపివేయాలని ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఎటువంటి చర్యలు చేపట్టవద్దని సూచించింది.

యూనిట్లు తక్కువ.. దరఖాస్తుల వెల్లువ

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లల్లో కార్పొరేషన్‌లను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పేదలకు ఒక్క యూనిట్ కూడా మంజూరు చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం కార్పొరేషన్ రుణాలను పునరుద్ధరించింది. సీఎం చంద్రబాబు మళ్లీ కార్పొరేషన్‌ల ద్వారా బీసీ, కాపు, ఎస్సీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించారు. వ్యాపారాన్ని బట్టి ప్రభుత్వం 10 నుంచి 60 శాతం సబ్సిడీ, మిగిలినది బ్యాంక్ రుణం, ఐదు శాతం వరకు లబ్ధిదారుడి వాటా కింద విభజించారు. ఐదేళ్ల తర్వాత మళ్లీ కార్పొరేషన్ రుణాలు అమల్లోకి రావడంతో యూనిట్లు వందల్లో ఉంటే దరఖాస్తులు వేల సంఖ్యలో వచ్చిపడ్డాయి. బీసీ కార్పొరేషన్ రుణాల కింద జిల్లాకు 3,039 యూనిట్లు మంజూరు చేస్తే ఏకంగా 20,101 మంది దరఖాస్తు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే రుణాలకు ఈనెల 7వ తేదీ వరకు 1,111 యూనిట్‌లకు గాను, 14,000 మంది దరఖాస్తు చేసుకున్నారు. యూనిట్ల సంఖ్య తక్కువగా ఉండగా అందిన దరఖాస్తులు వేలల్లో రావడంతో అత్యధికులకు రుణాలు అందని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో మళ్లీ యూనిట్ల సంఖ్యను పెంచి మరింత మందికి లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. దీనిలో భాగంగానే ప్రస్తుతం అర్హులను బట్టి, కొత్తగా మరింత మందిని ఎంపిక చేసి అందరికీ ఒకేసారి ఈ పథకం అమలు చేయడం కోసం రుణ ప్రక్రియను నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్టు చెబుతున్నారు.

'ఇప్పటి వరకు బీసీ రుణాలకు సంబంధించి యూనిట్ల మంజూరు చేసే ప్రక్రియను నిలుపుదల చేయాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి రుణాల మంజూరు తాత్కాలికంగా వాయిదా వేశారు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తదుపరి ప్రక్రియను కొనసాగిస్తాం' అంటూ బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలత పేర్కొన్నారు.

టీడీపీతోనే భవిత

పదేళ్లు సీఎంగా చంద్రబాబు

» పవన్ నోట ఇదే మాట.. పార్టీ కోసం కష్టపడండి
» లేదంటే రాష్ట్రం అధోగతే.. చరిత్ర చెప్పిందిదే
» రానున్న రోజుల్లో బీసీలకు పెద్ద పీట.. పశ్చిమ టీడీపీ మహానాడులో నేతల స్పష్టీకరణ


ఎన్టీఆర్ విగ్రహానికి నేతల నివాళులు

తణుకు, మే 24(ఆంధ్రజ్యోతి):'రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలన్నా, పేదలు అభ్యున్నతి చెందాలన్నా మరో 15 ఏళ్లపాటు తెలుగుదేశం అధికారంలో ఉండాలి. పదేళ్లపాటు చంద్రబాబు ముఖ్యమంత్రిగా కొనసాగాలి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెబుతున్న మాట కూడా ఇదే. లేదంటే రాష్ట్రం అధోగతి పాలు కావడం ఖాయం. చరిత్ర చెబుతున్నది ఇదే. 2019 నుంచి 2024 వరకు ఐదేళ్ల రాక్షస పాలన సాగింది. దుర్మార్గపు పాలన అంతమొందించడానికి ప్రతి కార్యకర్త అహర్నిశలు శ్రమించి టీడీపీ కూటమిని అధికారంలోకి తెచ్చారు. రాష్ట్ర భవిష్యత్తు మళ్లీ గాడిలో పడింది. ఇదే అభివృద్ధి కొనసాగాలంటే, రాజధాని, పోలవరం ప్రాజెక్టులు పూర్తి కావాలంటే మన ప్రభుత్వం సుదీర్ఘంగా కొనసాగాలి. రాష్ట్రం కోసం, ప్రజల కోసం టీడీపీ ప్రభుత్వాన్ని కాపాడుకుందాం' అంటూ తెలుగుదేశం పార్టీ నేతలు పిలుపునిచ్చారు. తణుకులో శనివారం సాయంత్రం టీడీపీ పశ్చిమ గోదావరి జిల్లా మహానాడు పార్టీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు ఆధ్వర్యంలో జరిగింది.ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పర్యవేక్షణలో మహానాడు విజయవంతమైంది. పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, తోట సీతారామలక్ష్మి, మైనారిటీ వ్యవహారాల సలహాదారు షరీఫ్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు, ఇన్‌ఛార్జులు వలవల బాబ్జి, పొత్తూరి రామరాజు, మెంటే పార్థసారథి, కోళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు తెలుగుదేశం ప్రస్థానంపై నాయకులు ప్రస్తావించారు. గతంలో ఎన్టీఆర్ పార్టీకి పునాది వేసి అభివృద్ధి చేస్తే వర్తమానంలో చంద్రబాబు, భవిష్యత్తులో లోకేశ్ కీలకంగా ఉంటారని స్పష్టం చేశారు. కూటమి ఐక్యంగా ఉండాలని, కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు అభినందిస్తూ తీర్మానం చేశారు.



డాగ్ స్క్వాడ్ భవనం ప్రారంభం. పోలీస్ జాగిలం నుంచి పుష్పగుచ్ఛం స్వీకరిస్తున్న ఐజీ

కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలి : ఐజీ అశోక్‌కుమార్

ఏలూరు క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి) : కేసుల దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయాన్ని శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన తనిఖీ చేశారు. తొలుత ఐజీకి ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్ పూలమొక్కను అందించి స్వాగతం పలుకగా జిల్లా పోలీస్ యంత్రాంగం తరఫున పోలీస్ గౌరవ స్వాగతాన్ని పలికారు. జిల్లాలో శాంతి భద్రత, నేర నియంత్రణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలన, మహిళల రక్షణపై ప్రత్యేక దృష్టి సారించా లని ఆయన సూచించారు. ఏఆర్ విభాగం, డాగ్‌స్క్వాడ్, కమాండ్ కంట్రోల్ రూమ్, డ్రోన్ వినియోగం, డిస్ట్రిక్ట్ క్రైం రికార్డు బ్యూరో, స్పెషల్ బ్రాంచ్, ఫింగర్ ప్రింట్ విభాగాలను ఆయన తనిఖీలు చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

పోలీసు జాగిలాల భవనం ప్రారంభం

ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయ సమీపంలో నూతనంగా నిర్మించిన డాగ్ స్క్వాడ్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత డాగ్‌రాజీ ఐజీకి గౌరవవందనం చేసి పుష్పగుచ్ఛం అందించగా ఆయన స్వీకరించారు. అనంతరం జిల్లాలో సేవలు అందిస్తున్న డాగ్ హ్యాండ్లర్స్, పోలీస్ జాగిలాల విశిష్టతను ఆయన అడిగి తెలుసుకున్నారు. అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్‌ఎస్‌ఎస్ శేఖర్, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్‌ఎస్ఐ భాస్కరరావు, నరేంద్ర, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్వా క్రాప్ హాలిడేకు రైతుల మద్దతు

» వచ్చేనెల 10న చలో అమరావతికి సిద్ధం : గాంధీభగవాన్‌రాజు

పాలకొల్లు రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): సంక్షోభంలో ఉన్న ఆక్వా రంగానికి పూర్వ వైభవం తీసు కొచ్చే విధంగా పాలకొల్లు జైభారత్ క్షీరారామ ఆక్వా సంఘం ప్రకటించిన క్రాప్ హాలిడేకు ఆక్వా రైతులందరూ మద్దతు తెలపడం అభినందనీయమని చైర్మన్ గొట్టుముక్కల గాంధీభగవాన్ రాజు అన్నారు. పూలపల్లి ఆక్వాసంఘ భవనంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకొల్లు, నరసాపురం, ఆచంట మూడు నియోజక వర్గాల్లోని 60 వేల ఎకరాల్లో ఇప్పటికే 20వేల ఎకరాల్లో క్రాప్ వేయకుండా హాలిడేను ప్రకటించారన్నారు. మిగిలిన 40 వేల ఎకరాల్లో జూలై ఒకటి నుంచి మూడు నెలలు పాటు ఆక్వా క్రాప్ హాలిడే పాటిస్తామన్నారు. ఆక్వా సమస్యలపై జూన్ 10న చేపట్టిన చలో అమరావతి కార్యక్రమానికి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామన్నారు. సంఘం నేతలు. బోనం చినబాబు, గుంటూరి చంటిరాజు, పెన్మెత్స సత్యనారాయణరాజు, బోనం రంగయ్యనాయుడు, మేకా ఫణీంద్ర ప్రసాదు, భూపతిరాజు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఆయుష్ ఆసుపత్రికి ఎన్‌ఏబీహెచ్ అక్రిడిటేషన్



మాట్లాడుతున్న డాక్టర్ యార్లగడ్డ రమేష్‌బాబు

ఏలూరు, మే 24(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలో నాణ్యత ప్రమాణాలతో వైద్యరంగంలో అందించిన సేవలకు ఆయుష్ ఆసుపత్రికి న్యూఢిల్లీలోని నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ హాస్పిటల్స్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ (ఎన్‌ఏబీహెచ్) అక్రిడిటేషన్ లభించిందని ఆయుష్ ఆసుపత్రుల నిర్వహణ కమిటీ చైర్మన్ డాక్టర్ యార్లగడ్డ రమేష్‌బాబు తెలిపారు. ఏలూరు అశోక్‌నగర్‌లోని ఆయుష్ ఆసుపత్రిలో శనివారం విలేకరుల సమావేశంలో ఎన్‌ఏబీహెచ్ అక్రిడిటేషన్ ధ్రువపత్రాన్ని వైద్యులు, సిబ్బందితో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఏలూరులో మూడేళ్ల క్రితం ప్రారంభించిన ఆసుపత్రికి ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు లభించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఎన్‌ఏబీహెచ్ అక్రిడిటేషన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ బొప్పన దశరథ్ మాట్లాడారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అక్కిన శ్రీరామ్, డాక్టర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

28 నుంచి స్పెషల్ కేటగిరీ విద్యార్థులకు కౌన్సెలింగ్

నూజివీడు టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా నూజివీడులోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌లో అడ్మిషన్లకు సంబంధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం 28 నుంచి ప్రారంభిస్తున్నట్టు నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో క్యాప్, బీసీసీ, ఎన్‌ఎస్‌ఎస్ స్పోర్ట్స్, తదితర స్పెషల్ కేటగిరీకి సంబంధించి ఈనెల 28 నుంచి 31 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తామన్నారు.



ఆకట్టుకున్న ఫ్యాషన్‌షో



ఏలూరు రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : అందమైన అమ్మాయిలు క్యాట్ వాక్‌తో ఏలూరు నగరం సందడిగా మారింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన మోడల్స్ క్యాట్ వాక్‌తో నిర్వహించిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. యువతీ యువకుల్లో దాగున్న సృజనాత్మకత వెలుగులోకి తీసుకొచ్చి మోడలింగ్, సినీ రంగాల్లో రాణించేందుకు వారి ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చేలా ఎస్‌జే ఈవెంట్స్ ఆధ్వర్యంలో శనివారం ఏలూరు క్రాంతి కల్యాణ మండపంలో ఫ్యాషన్‌షో నిర్వహించారు. ఈ పోటీల్లో హెయిర్ స్టైల్స్, డ్రసింగ్, వాకింగ్, ఇంటెలిజెన్స్ అంటూ నాలుగు రౌండ్లు జరిగాయి. యువతీ యువకులు, వివాహిత మహిళలు ప్రతిభను చాటారు. ముగ్గురిని విజేతలుగా ఎంపిక చేశారు. ఈవెంట్ నిర్వాహకులు నేహా, జాస్మిన్, తదితరులు పాల్గొన్నారు.

సహకార బదిలీలపై కసరత్తు

» ఉమ్మడి జిల్లాలోని 34 బ్రాంచిల్లో సుమారు 1,450 మందికి తప్పని స్థానచలనం

సహకార శాఖలో బదిలీలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల నియామకం జరిగి పది రోజులవుతోంది. వీరి నియామకాలకు సంబంధించి అధికారికంగా జీవోలు రావాల్సి ఉంది. మరోవైపు సహకార ఉద్యోగుల బదిలీలపై ఉత్కంఠ నెలకొంది. జూన్ రెండో తేదీలోగా బదిలీల ప్రక్రియ ముగించాల్సి ఉంది. ఆ తర్వాత బదిలీలపై మూడో తేదీ నుంచి నిషేధం అమల్లోకి రానుంది. ఈలోగా కోరుకున్న చోటుకు బదిలీ ఎలా చేయించుకోవాలన్న దానిపై ఉద్యోగుల, సిబ్బంది తర్జన భర్జనలు పడుతున్నారు.

ఏలూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) :



గతేడాది సంవత్సరం మధ్యలో బదిలీల వల్ల తమకు ఇబ్బందులు తలెత్తుతాయని రాష్ట్ర కో-ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ అభ్యంతరం తెలిపింది. దానికి తోడు మరోవైపు అప్పుడే జిల్లాలో సొసైటీల కంప్యూటరీకరణ చేయడంతో ప్రభుత్వం బదిలీల నుంచి సహకారశాఖకు మినహాయింపు ఇచ్చింది. అప్పట్లో ఒకేచోట రెండేళ్ల సర్వీస్ పూర్తయిన వారు ఉన్నారు. డీసీసీబీ 34 బ్రాంచిల పరిధిలో ఉమ్మడి జిల్లాలోని పీఏసీఎస్‌ల్లో 250 సెక్రటరీలు, 1,200 మంది సిబ్బందికి ఈసారి బదిలీ ఖాయంగా కనిపిస్తోంది. గతేడాదికి రెండేళ్లు పూర్తయి మూడో ఏడాదిలోకి వీరంతా ప్రవేశించడంతో మూడు ఆప్షన్ల ప్రాతిపదికన వారు కోరుకున్న చోటకు బదిలీలు చేసేందుకు డీసీసీబీ అధికారులు కసరత్తు ప్రారంభించారు.

సెక్రటరీలకు స్థానచలనం

వ్యాపార లావాదేవీల ఆధారంగా నాలుగు కేటగిరీల కింద పీఏసీఎస్‌ల సెక్రటరీలను విభజించారు. వీరందరికి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేస్తున్నందున సుదీర్ఘంగా ఒకేచోట ఏళ్ల తరబడి సెక్రటరీలుగా పనిచేస్తున్న వారికి ఈసారి బదిలీ తప్పనిసరిగా మారింది. ఆరు జిల్లాలకు సంబంధించి గుంటూరులోని రిజిస్ట్రార్ ఆఫ్ కో-ఆపరేటివ్ కార్యాలయం పరిధిలో బదిలీల కసరత్తు జరుగుతోంది. డీఎల్‌పీసీ కమిటీ దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఇందులో జిల్లాలో ఎంత మంది స్థానచలనం ఉంటుందో ఈనెలాఖరుకి ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. జిల్లా సహకారశాఖ అధికారి పరిధిలో అసిస్టెంట్, డివిజనల్, ఇతర విభాగాల్లోని రిజిస్ట్రార్లకు స్థాన చలనం కలిగే అవకాశం ఉంది. వీరంతా కలిసి 45 మంది ఉంటారని అంచనా.



విలేకరులతో మాట్లాడుతున్న జేడీ ముక్కంటి

హాస్టల్ భవనాలకు రూ.12 కోట్లు

» రూ.5.72 కోట్లతో మరమ్మతులు
» జూన్ నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు
» సాంఘిక సంక్షేమ శాఖ జేడీ ముక్కంటి

ఏలూరు రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి):ఏలూరు జిల్లాల్లో శిథిలావస్థలో ఉన్న 4 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను రూ.12 కోట్లతో నూతన భవనాలు నిర్మిస్తునట్లు సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ ఎం.ముక్కంటి చెప్పారు. ఏలూరు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో కైకలూరు, పెదపాడు, గండుగొలను, ముదినేపల్లిలలో శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల స్థానంలో రూ.12 కోట్లతో కొత్త భవనాలు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఏలూరు జిల్లాలో మొత్తం 59 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయని, వాటిలో 53 ప్రభుత్వ భవనాల్లో, 6 ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం 59 వసతి గృహాల్లో 27 బాలుర వసతి గృహాలలో 1,766 మంది విద్యార్థులు, 32 బాలికల వసతి గృహాల్లో 2,694 మంది విద్యార్థినులు వసతి పొందుతున్నారు. ప్రభుత్వం నిర్వహించే భవనాలలో 52 భవనాలు మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5.72 కోట్లు మంజూరు చేసిందన్నారు. 90 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 10 శాతం పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. జూన్ మొదటివారం నాటికి భవనాల మరమ్మతులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 56 సంక్షేమ వసతి గృహాల్లో 448 సీసీ కెమెరాలు అమర్చామన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 6,900 మంది ప్రవేశాలు లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాలలో 87శాతం, ఇంటర్మీడియట్‌లో 89 శాతం హాస్టల్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ముక్కంటి తెలిపారు.

పూళ్ల హాస్టల్‌లో సమీక్ష

భీమడోలు:రానున్న విద్యాశాఖ సంవత్సరంలో అధికారులు సమన్వ యంతో పనిచేసి హాస్టల్స్ అడ్మిషన్ల లక్ష్యాలను చేరుకోవాలని జేడీ ముక్కంటి పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం భీమడోలు మండలం పూళ్ల ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఉంగుటూరు పరిధిలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఉంగుటూరు పరిధిలోని నిడమర్రు, ద్వారకాతిరుమల, భీమడోలు, ఉంగుటూరు మండలాలకు చెందిన అధికారులు, సిబ్బందికి సూచనలిచ్చారు. సర్పంచ్ సుజాత ప్రసాద్ పాల్గొన్నారు.

ఐవోఈ రాష్ట్ర చైర్మన్‌గా జేహెచ్‌వీ ప్రసాద్



తణుకు రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (ఐవోఈ) రాష్ట్ర చైర్మన్‌గా తణుకు చెందిన జేహెచ్‌వీ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఐవోఈ సభ్యుడు వెలగన శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. తణుకు పట్టణానికి చెందిన ప్రసాద్‌తో పాటు భీమవరానికి చెందిన అనిల్‌వర్మ కార్యవర్గ సభ్యుడుగా నూతన కార్యవర్గంలో ఎన్నుకున్నట్లు తెలిపారు.

29,30 తేదీల్లో క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు

ఏలూరురూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ (ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల) ఆధ్వర్యంలో ఈనెల 29, 30 తేదీలలో ఏలూరు సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆర్‌ఎస్‌ఆర్ మూర్తి, అశోక్‌కుమార్, ఎస్‌కే షామీర్‌హుస్సేన్ తెలిపారు. రెండురోజుల పాటు సీనియర్ అండర్- 23 విభాగంలో ఎంపికలు జరుగుతాయన్నారు. క్రీడాకారులు 2002 సెప్టెంబరు ఒకటో తేదీ తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డు, సొంత క్రికెట్ కిట్లు, వైట్ డ్రస్‌తో హాజరవ్వాలని తెలిపారు.

ఓఎల్‌ఎక్స్‌లో ఫ్రిజ్ కొంటానంటూ..

ఏలూరు క్రైం, మే 24(ఆంధ్రజ్యోతి): ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన పాత ఫ్రిజ్‌ను అమ్ముతానంటూ ఓఎల్‌ఎక్స్‌లో ప్రకటన పెట్టాడు. ఒక వ్యక్తి తాను కొంటానంటూ మాయమాటలు చెప్పి వాట్సాప్‌కు ఒక స్కానర్ పంపి రూ.92 వేలు అపహరించిన ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏలూరు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. ఏలూరు ఎన్‌ఆర్‌పేటకు చెందిన మానుకొండ సాయికృష్ణ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఏలూరులోని తన ఇంట్లో ఉన్న పాత ఫ్రిజ్‌ను ఓఎల్‌ఎక్స్‌లో అమ్మకానికి ప్రకటన పెట్టారు. ఒక అజ్ఞాత వ్యక్తి కాల్‌చేసి ఇండియన్ ఆర్మీ ఉద్యోగిని అంటూ తాను కొంటానని ఫ్రిజ్‌ను బేరం కుదుర్చుకున్నాడు. ఫోన్‌పే నంబరు నిర్ధారణ కోసం రెండు రూపాయలు ఫోన్‌పే చేశానన్నాడు. అయితే తనకు రాలేదని సాయికృష్ణ చెప్పడంతో అయితే తన నంబరు పనిచేయడం లేదని యూపీఐ స్కానింగ్ నెంబర్ వాట్సాప్‌లో పెడుతున్నానని దానికి పిన్ ఎంటర్ చేయాలని చెప్పడంతో ఆ మాటలు నమ్మిన సాయికృష్ణ వాట్సాప్‌లో వచ్చిన స్కానర్‌కు పిన్ ఎంటర్ చేయగా వెంటనే సాయికృష్ణ ఖాతాలో ఉన్న రూ.92 వేలు తస్కరించాడు. తాను మోసపోయానని గ్రహించి 1930కు ఫిర్యాదు చేయగా అప్పటికే అజ్ఞాతవ్యక్తి రూ.30 వేలు డ్రా చేసేశాడు. రూ.62 వేలు మాత్రమే సైబర్ సెల్ అధికారులు ఫ్రీజ్ చేశారు. ఈ ఘటనపై ఏలూరు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సాయికృష్ణ ఫిర్యాదు చేయగా సీఐ వి.కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైమ్ సమాచారం

లారీ ఢీ కొని ఒకరి మృతి

ఏలూరు క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి) : టీవీఎస్ మోపెడ్‌ను లారీ వెనుక నుంచి ఢీ కొనడంతో మోపెడ్ వెనుక కూర్చున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం పోణంగికి చెందిన యాతం ఆనంద్‌కు మార్(29)కి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వంగాయిగూడెం వద్ద ఉన్న పెట్రోల్ బంక్‌లో పనిచేస్తుం టాడు. శనివారం ఉదయం పనిలోకి రావడానికి అదే గ్రామానికి చెందిన తెలిసిన వారి టీవీఎస్ మోపెడ్‌పై వస్తుండగా చిరంజీవి బస్‌స్టాప్ వద్ద వెనుకనుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ మదీనాబాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

చెరువులోకి దిగిన మహిళ మృతి



గంగ (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, మే24 (ఆంధ్ర జ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులోకి దిగిన మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని మెట్టఉప్పరగూడెంలో శనివారం జరిగింది. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాలివి.. మెట్టఉప్పరగూడెంకు చెందిన సైదు గంగ(42) శనివారం చెరువులో పశువులను కడిగేందుకు తీసుకెళ్లింది. ఈ క్రమంలో గేదె లోపలికి వెళ్లి పోతుందని వెనుకగా వెళ్లిన ఆమె ప్రమాదవశాత్తు లోపలికి వెళ్లి మునిగింది. స్థానికులు గమనించి బయటకు తీసేలోపు ఆమె మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇనుప రాడ్డు, సుత్తితో కొట్టి చంపేశారు

» ఆటో డ్రైవర్ హత్య కేసులో సంచలన విషయాలు
» ఇద్దరి అరెస్ట్.. వివరాలు వెల్లడించిన డీఎస్పీ జయసూర్య



భీమవరం క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి): తన భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడన్న అనుమానం, అదేవిధంగా తన ఇంట్లో దొంగతనం చేశాడన్న ఆరోపణలతో ఆటో డ్రైవర్ హత్య జరిగినట్లుగా భీమవరం డీఎస్పీ ఆర్ జీ జయసూర్య తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. స్థానిక చినరంగనిపాలెంలో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ కాటూరి దుర్గారావు(28) భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన బొమ్మల వ్యాపారి, ఆటో డ్రైవర్ ఎల్లా కోటేశ్వరరావు(బాబి)తో రెండేళ్లక్రితం పరిచయమైంది. అనంతరం దుర్గారావు. బాబి వద్ద ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ఈనెల 4న దుర్గారావు తన సోదరుడు నివాసం వద్ద ఉండగా ఎల్లా బాబి, తన కుమారుడు వెళ్లి దుర్గారావుపై దొంగతనం నేరం మోపారు. అనంతరం వారి ఇంటికి తీసుకువెళ్లి బాబి అతని భార్య షేక్‌మేరి, తన కుమారుడు కలిసి అతడిని ఇనుపరాడ్డు, సుత్తితో కొట్టి దాడి చేశారు. అనంతరం అతడి కాళ్లు, చేతులు కట్టి, నోటిలో గుడ్డలు కుక్కి ఒక సంచిలో కట్టారు. ఆటోలో వేసుకుని ముగ్గురూ కలిసి బాబి స్వగ్రామమైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వెదిరేశ్వరం తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు. మార్గమధ్యలో అతడు కదులుతూ ఉండడంతో మళ్లీ గట్టిగా సంచిని ఆటోకేసి కొట్టడంతో మృతి చెందాడు. అక్కడ నుంచి వెదిరేశ్వరం తీసుకువెళ్లి మృతదేహాన్ని సంచిలో నుంచి బయటకు తీసి మరో చిన్న సంచిలో మూటకట్టి ద్విచక్ర వాహనంపై బాబి, అతని కుమారుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జొన్నాడలోని కోటిపల్లి కాలువలో పడవేసి ఇంటికి వచ్చేశారు. ఈనెల 21న మృతుడు సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు బాబి, అతడి భార్య మేరీని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. మృతదేహాన్ని కాలువలో పడవేసినట్లుగా చెప్పడంతో కాలువలో జాలర్ల సహాయంతో ఈనెల 23న మృతదేహాన్ని బయటకు తీశారు. అక్కడ పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ కేసులో ఎల్లా కోటేశ్వరరావు (బాబి), అతని భార్య షేక్ మేరీని అరెస్ట్ చేసి వారి వద్ద సుత్తి, ఇనుపరాడ్డు, సంచిని స్వాధీనం చేసుకున్నట్లుగా డీఎస్పీ తెలిపారు. కుమారుడు పరారీలో ఉన్నాడని తెలిపారు. సీఐ ఎన్.నాగరాజు, ఎస్ఐ కృష్ణాజీ, సిబ్బంది ఉన్నారు.

పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీ

» కేజీన్నర వెండి, రూ.2.50 లక్షల నగదు అపహరణ

జీలుగుమిల్లి, మే, 24:(ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లిలో ఓ వ్యాపారి ఇంటో పట్టపగలే గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడిన ఘటన జరిగింది. గ్రామానికి చెందిన సాదు చెన్నారావు కుటుంబం ఇటీవల ఎరువుల దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం సమీప ఇంట్లో ఉంటున్నారు. ఇటీవల వ్యాపారం నిమిత్తం ఇంట్లో వారు మరోచోట ఏర్పాటు చేసుకున్న ఎరువుల దుకాణం వద్దకు వెళుతుంటారు. ఇదే అదునుగా శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దొంగలు ఇంటి దక్షిణం వైపు తలుపులకు వేసిన గడియలను తొలగించి లోపలికి ప్రవేశించారు. బీరువాలో కిలోన్నర వెండి, బ్యాగ్‌లో ఉన్న సుమారు రూ. 2.50 లక్షల నగదు దొంగిలించారని బాధితుడు చెన్నారావు కుటుంబ సభ్యులు తెలిపారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా బెడ్‌రూంలో బీరువా తలుపులు తెరిచి బట్టలు చిందర వందరగా పడి ఉండడం గమనించామన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని ఏఎస్ఐ నాగేశ్వరరావు పరిశీలించి విచారణ జరుపుతున్నారు.

మట్టి తరలిస్తున్న రెండు లారీలను అడ్డుకున్న పోలీసులు

పోలవరం, మే 24 : పోలవరంలో మట్టి రవాణా చేస్తు న్న రెండు లారీలను పోలీసులు శుక్రవారం రాత్రి అడ్డుకున్నారు. మట్టి రవాణా వాహనాల డ్రైవర్లు పోలీసులతో వాగ్వివాదానికి దిగడంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు మట్టి రవాణా చేస్తున్న రెండు లారీలతో పాటు మరో రెండు ఖాళీ లారీలను పోలవరం పోలీస్ స్టేషన్‌కి తరలించారు. పోలవరం స్టేషన్ రైటర్ శ్రీనివాస్ తెలిపిన వివరాలివి.. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం హుకుంపేట, బీమోలు ప్రాంతాల చెరువుల నుంచి గోపాలపురం రెవెన్యూ అధికారుల అనుమతులతో తరలిస్తున్న మట్టి గోపాలపురం మండలంలో పంటపొలాలకు తరలించాల్సి ఉండగా పరిధి దాటి పోలవరం తీసుకువచ్చి ఇటుక బట్టీలకు అమ్మకాలు జరుపుతున్నట్టుగా వచ్చిన సమాచారం మేరకు లారీలను స్వాధీనం చేసుకున్నామన్నారు. తహసీల్దార్ సాయిరాజు ఎదుట హాజరు పరచగా వారికి జరిమానా విధించినట్టు తెలిపారు.



వచ్చే నెలలో వందే భారత్ ?

నరసాపురం, మే 24(ఆంధ్రజ్యోతి): నరసాపురం-చెన్నై వందేభారత్ కూత వినేందుకు రోజులు సమీపిస్తున్నాయి. అన్నీ అనుకూలిస్తే.. జూన్ రెండో వారం లేదా నెలాఖరులోపు ఈ రైలు జిల్లాకు వచ్చే అవకాశం ఉంది. అవసరమైన ఏర్పాట్లను 90 శాతం నరసాపురం స్టేషన్‌లో పూర్తి చేశారు. రైల్వే బోర్డు నుంచి అనుమతి రాగానే రాకపోకల షెడ్యూల్‌ను ప్రకటించేందుకు దక్షిణ మధ్య రైల్వే సిద్ధంగా ఉంది. ప్రస్తుతం చెన్నై-విజయవాడ మధ్య ఈ రైలు నడుస్తుంది. దీన్ని నరసాపురం వరకు పొడిగించనున్నారు. చెన్నైలో ఉదయం ఐదు గంటలకు బయలుదేరి ఉదయం పదకొండు గంటలకు వస్తుంది. తిరిగి అక్కడ 3.30 గంటలకు బయలుదేరి రాత్రి 10 గంటలకు చెన్నై చేరుతుంది. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ కృషి వల్ల ఈ రైలు పొడిగింపునకు ఆమోదం లభించింది.



వలలో చిక్కిన కొండచిలువ

వలకు చిక్కిన 8 అడుగుల కొండ చిలువ

పెంటపాడు,మే24(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు వేసిన వలలో కొండచిలువ చిక్కుకుంది. స్థానికులు తెలిపిన వివరాలివి.. మండలంలోని పరిమెళ్ల గ్రామం చినకాపవరం కాలువలో మత్స్యకారులు చేపల కోసం వలను వేశారు. ఈ వలలో సుమారు ఎనిమిది అడుగులు పొడవుగల కొండచిలువ చిక్కుకుంది. స్థానికులు భయభ్రాంతులకు గురికావడంతో పాములను పట్టే వ్యక్తికి ఫోన్ చేయగా అతడు వల నుంచి తొలగించి తీసుకెళ్లాడని తెలిపారు.



గుమ్ములూరు లాకుల వద్ద అమ్మవారి, డిప్యూటీ సీఎం ఫ్లెక్సీల చింపిన దృశ్యాలు

ఫ్లెక్సీల చించివేత

» పోలీసులకు ముసలమ్మ జాతర కమిటీ సభ్యుల ఫిర్యాదు

ఆకివీడురూరల్, మే24(ఆంధ్రజ్యోతి) : ఆకివీడు మండలం గుమ్ములూరు పంచాయతీ పరిధిలోని పల్లిపాలెం లాకుల వద్ద పుంతలో ముసలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన పుంతలో ముసలమ్మ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తోపాటు ఏర్పాటు చేసిన వారందరి ఫొటోలు చించివేశారని కొంతమంది కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కక్షపూరితంగా చేశారని, గ్రామాల్లో ప్రశాంతత లేకుండా వివాదాలు ఉండేవిధంగా కొంతమంది ఈవిధంగా చేస్తున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. అమ్మవారి ఫొటో, పవన్ కల్యాణ్ ఫొటో కావాలని చింపేశారని ఆరోపించారు. దీనిపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

28న ఇంటర్ గురుకులాల్లో బాలికలకు కౌన్సెలింగ్

బుట్టాయగూడెం, మే 24(ఆంధ్రజ్యోతి) : ఇంటర్ విద్యార్థినులు ఈ నెల 28న కళాశాలలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని ప్రాజెక్టు ఆఫీసర్ కె.రాములు నాయక్ తెలిపారు. కెఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని బూసరాజుపల్లి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో 2025- 26 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేస్తున్న బాలికలు హాజరుకావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, ఎతఃక్యూ కులాలకు చెందిన విద్యార్థులు హాజరు కావాలన్నారు.

ఐటీడీఏ పరిధిలో బదిలీలకు దరఖాస్తు చేసుకోండి

బుట్టాయగూడెం, మే 24(ఆంధ్రజ్యోతి) : బదిలీ కోరుకునే ఉద్యోగులు ఈ నెల 27వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ తెలిపారు. కె.ఆర్.పురం ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, వసతి గృహాల సంరక్షకులు, బోధనేతర సిబ్బంది, నాల్గవ తరగతి సిబ్బంది దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27వ తేదీ తరువాత వచ్చిన దరఖాస్తులను తిరస్కరించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి జూన్ 2వ తేదీ లోపుగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయనున్నట్టు తెలిపారు.

ఉద్యోగాల భర్తీలో అవకతవకలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఏలూరు అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి) : క్షయ(టీబీ) నియంత్రణ కార్యాలయంలో వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ఉద్యోగ నోటిఫికేషన్ల కింద భర్తీ చేస్తున్న ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేయాలని అభ్యర్థిస్తూ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఏలూరు 108 అంబులెన్సులో గత 19 సంవత్సరాలుగా ఈఎంటీగా పనిచేస్తున్న ఆర్.శ్రీనివాసరావు జిల్లా టీబీ కార్యాలయంలో జిల్లా కో-ఆర్డినేటర్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఉద్యోగాలకు విద్యార్హతలు ఎంబీఏ(హాస్పిటల్ మేనేజ్‌మెంట్)కాగా, కేవలం సర్వీసు వెయిటేజీతో పదోన్నతులిచ్చి కార్యాలయ ఉద్యోగాలను వారి బంధువులకే కేటాయిస్తున్నారని ఆరోపించారు. 2016 నుంచి విడుదలవుతున్న ప్రతి నోటిఫికేషన్‌లోనూ కొత్తవారికి ఉద్యోగాలు దక్కకుండా అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఫిర్యాదును డీఎంహెచ్‌వోకు పంపిస్తామని కలెక్టర్ చెప్పారని శ్రీనివాసరావు వివరించారు.

ఎమ్మెల్యే రోషన్ దృష్టికి కళాశాల సమస్య

కామవరపుకోట, మే 24(ఆంధ్రజ్యోతి) : శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరానికిగాను అడ్మిషన్స్ స్వీకరించడంలేదని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. శుక్రవారం రాత్రి రామన్నపాలెం గ్రామంలో జరిగిన పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా మురళీ ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ కళాశాల కొనసాగేలా కృషి చేయాలని మురళీ కోరారు. ఆయన వెంట మండల తెలుగుదేశం అధ్యక్షులు కిలారు సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యాం చంద్రశేషు, ఏఎంసీ మాజీ చైర్మన్ కె.వెంకట సుబ్బారావు, టీడీపీ ఏలూరు జిల్లా నాయకులు ఎం.నాగేశ్వర రాంబాబు, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు, రావూరి కృష్ణ, ఉన్నారు.

26 నుంచి నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

ఏలూరు టూటౌన్, మే 24(ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు లిడ్‌క్యాప్ ద్వారా వివిధ రకాల కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి తెలిపారు. లేదర్ స్టిచ్చింగ్ ఆపరేటర్, లేటర్ ఫుట్‌వేర్, లేదర్‌కట్టర్ ఫుట్‌వేర్‌లు ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. షెడ్యూల్ కులానికి చెందిన వారై 8వ తరగతి చదివి ఆధార్, రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. 45 రోజుల పాటు గుంటూరు జిల్లా నర్సీపట్నంలో శిక్షణ ఇస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతిభోజన సౌకర్యాలతో పాటు వెల్కమ్ కిట్ ఇస్తామన్నారు.ఈ నెల 26వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు(94941 74417, 79814 38585) సంప్రదించాలన్నారు.

మర్రిగూడెంలో గిరిజనుల ఆందోళన

బుట్టాయగూడెం, మే 24(ఆంధ్రజ్యోతి) : భూముల విషయంలో న్యాయం చేయాలని కోరుతూ శనివారం రెవెన్యూ కార్యాలయం ఎదుట మర్రిగూడెం గిరిజనులు ఏఐకేఎంఎస్(చంద్రన్నవర్గం) ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. గ్రామ రెవెన్యూ పరిధిలోని సుమారు 34 ఎకరాల భూమిని చాలాకాలం నుంచి తామే సాగు చేస్తున్నామని, పంటలను తీసుకెళ్తుంటే పోలీసులు అడ్డుకున్నట్టు వినతిలో పేర్కొన్నారు.ఇదిలా ఉంటే ఈ భూములు తమకే చెందుతాయని బాషా రంపాల రాజు కుమారులు స్పష్టం చేస్తున్నారు. రికార్డులు తమ వద్దే ఉన్నాయని కొందరు గిరిజనులు శనివారం దౌర్జన్యంగా భూమిలోకి ప్రవేశించి మామిడి పంటను ఎత్తుకుపోవడంతో విషయాన్ని పోలీసులకు చెప్పడంతో అడ్డుకున్నట్టు రంపాలరాజు కుమారులు తెలిపారు.

బీజేపీకి స్థానికంగా తగిన ప్రాతినిధ్యం కల్పించాలి

జంగారెడ్డిగూడెం,మే 24 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి నూతన అభివృద్ధి కమిటీలో బీజేపీకి ప్రాతినిధ్యం కల్పించకపోవడాన్ని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు పీసుపాటి వెంకట రామలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. టీడీపీ నాయకులు తమ పార్టీ నుంచి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కోసం దరఖాస్తులు తీసుకున్నారని, తమను విస్మరించారని పేర్కొన్నారు. బీజేపీ నుంచి కూటమి ప్రభుత్వంలో వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నా తమ క్యాడర్‌కు ఆసుపత్రి కమిటీలో చోటు లేకుండా కేవలం టీడీపీ, జనసేనతో మాత్రమే కమిటీ నియమించడం పట్ల అభ్యంతరం తెలిపారు. త్వరలో నియమించబోయే కో-ఆపరేటివ్ సొసైటీల్లో, గ్రంథాలయాలు, దేవాలయాల్లో బీజేపీకి తగిన ప్రాధాన్యత కల్పించకపోతే తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేస్తామన్నారు. పట్టణ, గ్రామ స్థాయిలో కూటమి నాయకులను సమన్వయం చేసుకోలేకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలతో పాటు పీఎం మోడీ చిత్రపటాలను ఉంచాలని రామలక్ష్మి డిమాండ్ చేశారు.

జనసేన సభ్యత్వాల నమోదుకు కృషి చేయాలి

భీమడోలు, మే 24(ఆంధ్రజ్యోతి) : జనసేన కార్యకర్తలు గ్రామాల్లో క్రియాశీలక సభ్యత్వాల నమోదుకు కృషి చేయాలని జనసేన పార్టీ గౌరవాధ్యక్షుడు మామిళ్ళపల్లి కాశీబాబు అన్నారు. గుండుగొలను గ్రామంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదును చేపట్టారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జనసేన అధ్యక్షుడు సింహాద్రిసాయి హేమకుమార్, కార్యదర్శి వెంకట్రావు, ఉపాధ్యక్షుడు అల్లూ శ్రీనివాస్, జగపతిబాబు, ఆగం సురేశ్ నూతన కమిటీలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ వగ్వాల విజయభాస్కర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సారా కేసుల్లో వేర్వేరు చోట్ల ముగ్గురి అరెస్టు

ఏలూరు/కుక్కునూరు, మే 24(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కామవరపుకోట, జీలకర్రగూడెం గ్రామాల్లో అధికారులు శనివారం విస్తృతంగా దాడులు నిర్వహిచారు. ఇందులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఏలూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ మహ్మద్ ఆరిఫ్, సిబ్బంది పాల్గొన్నారు. కుక్కునూరు మండలం పాము లేరుబ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీ ల్లో వేలేరు గ్రామానికి చెందిన వీ.సాయికిరణ్ వద్ద ఐదు లీటర్ల సారా పట్టుబడింది. సాయి కిరణ్‌ను అరెస్టు చేసి మోటర్ సైకిల్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. అదే గ్రామానికి చెందిన సురేశ్ పరారీలో ఉన్నట్టు ఎస్.ఐ. రామకృష్ణ తెలిపారు. సారా తయారీదా రులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమేశ్‌బాబు తెలిపారు.

కొల్లేరు పర్యాటకాభివృద్ధికి చర్యలు : చింతమనేని


పనులు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

ఏలూరు రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి) : గుడివాకలంక వద్ద ఉన్న మాధవాపురం పక్షుల ఆవాస కేంద్రం వద్ద అధ్వానంగా ఉన్న గట్లను బలోపేత చేసే పనులను శనివారం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొల్లేరు గ్రామాల ప్రజల సమస్యలను పరిష్కరించి, వారి గ్రామాలను అభివృద్ధి చేయడంతో పాటు మాధవాపురం పక్షుల ఆవాస కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. పక్షుల ఆవాస కేంద్రాల సందర్శన కోసం వచ్చే పర్యాటకులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆ గట్లను బలోపేతం చేస్తున్నట్టు తెలిపారు. వర్షాలు సమీపిస్తున్న నేపథ్యంలో పనులు సత్వరమే పూర్తి చేసేలా గుత్తేదారు సంస్థ ప్రతినిధులను ఆదేశించామన్నారు.

చినవెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి

ద్వారకాతిరుమల, మే 24(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. దాదాపు 20 వేల మందికి పైబడి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. శ్రీవారి ఉచిత దర్శనానికి 3 గంటల పైబడి సమయం పట్టింది. మధ్యాహ్నం 3గంటల తరువాత కాస్త రద్దీ తగ్గింది. దర్శనానంతరం భక్తులు శ్రీవారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

పారిజాతగిరి వేంకటేశ్వర స్వామికి చక్రస్నానం

జంగారెడ్డిగూడెం, మే 24(ఆంధ్రజ్యోతి) : గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం యజ్ఞ బ్రహ్మ పానంగిపల్లి సత్యపవన్, ఆలయ ప్రధానార్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు వసంతోత్సవం, చూర్ణోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరులో స్వామికి చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని గజవాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఈవో మానికల రాంబాబు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పేరిచర్ల జగపతిరాజు, సభ్యులు దండు ధనరాజు, అబ్బిన దత్తాత్రేయ పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్ల సమస్య పరిష్కరించండి

చింతలపూడి పట్టణ ప్రజల వేడుకోలు

చింతలపూడి, మే 24(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నగర పంచాయతీలో పబ్లిక్ టాయిలెట్ల సమస్య పరిష్కరించాలంటూ ప్రజలు కోరుతున్నారు. నగర పంచాయతీగా ఏర్పడి ఐదేళ్లయినా అధికార పాలనలోనే కొనసాగుతోంది. మునిసిపాలిటీగా మారినా ఆ స్థాయికి తగ్గ సౌకర్యాలు ఒక్కటీలేవు. అభివృద్ధి లేదు. నిధులు దేనికి ఖర్చు చేస్తున్నారో ప్రజలు తెలియదు. పన్నులు మాత్రం అపరాధ రుసుంతో వసూలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మునిసిపాలిటీకి కల్పించాల్సిన కనీస సౌకర్యాలు లేక పరిసర గ్రామాల నుంచి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పబ్లిక్ టాయిలెట్ లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రధానంగా రద్దీగా ఉండే పాత బస్టాండ్ ఏరియాలో మరింత ఇబ్బందిగా ఉంటోంది. టాయిలెట్ సౌకర్యం లేకపోవడంతో మహిళలు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడే నగర పంచాయతీ కార్యాలయం కూడా ఉంది. బహిరంగ మలవిసర్జన చేయవద్దని హెచ్చరికలు చేస్తుంటారే తప్ప అందుకు అవసరమైన మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం లేదంటూ ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. గత అధికారుల హయాంలో సులభ కాంప్లెక్స్ ఏర్పాటుకు సన్నాహాలు జరిగాయి. ఎందుకు ఆ ప్రాజెక్టు ఆగిపోయింది. నగర పంచాయతీ ఎన్నికలు రాకముందే మునిసిపల్ స్థలాలు గుర్తించి వాటి ఆక్రమణలు తొలగించి వినియోగంలోకి తెస్తే ఇటువంటి అవసరాలకు ఆ స్థలాలు ఉపయోగపడతాయని కమిషనర్ వాటిపై దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.


చింతలపూడి పాతబస్టాండ్ ఏరియా

రోడ్డుపై వదిలేస్తామంటే ఊరుకోం

ఎండీయూ ఆపరేటర్ల ధర్నా, ర్యాలీ


నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఆపరేటర్లు

ఏలూరు రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి) : ఎండీయూ వ్యవస్థను తీసుకొచ్చి 72 నెలలకు అగ్రిమెంట్ చేసుకుని అర్ధంతరంగా రోడ్డుపై వదిలేస్తామంటే ఎలా అంటూ ఆపరేటర్లు పేర్కొన్నారు. 2027 జనవరి వరకు అంటే ఇంకా సుమారు 20 నెలలు కొనసాగే హక్కు తమకు ఉందన్నారు. ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటే చూస్తూ ఊరుకోమని, తమకు ఉపాధి చూపించాలంటూ ఎండీయూ ఆపరేటర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆపరేటర్లు ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. రాష్ట్ర సమైక్య ఏలూరు జిల్లా అధ్యక్షుడు సగ్గుర్తి జయరాజు ఆధ్వర్యంలో ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి ఎండీయూ వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. వీరికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు నియోజకవర్గం సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాశ్, సీపీఐ బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి.కిశోర్‌లు మద్దతు పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అకస్మాత్తుగా ఇంటింటి రేషన్ పంపిణీ విధానం రద్దు చేయడం వలన, 9,260 మంది ఎండీయులు మరో 9,260 మంది హెల్పర్లు సుమారు 20 వేల మంది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో ధనికొండ దుర్గారావు, బండారు రమేష్, అనిల్, ఇస్మాయిల్, దాసరి మునలయ్య, కొల్లు అంజనేయులు, సుధీర్, కె.సురేశ్, తాళం పరశురామయ్య పాల్గొన్నారు.

అనాథ బాలలకు గుర్తింపు కార్డులు : బుల్లికృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి బుల్లికృష్ణ

ఏలూరు క్రైం, మే 24(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అనాథ, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన గుర్తింపు కార్డులేని బాలలను గుర్తించి వారికి గుర్తింపు కార్డును ఇప్పించాలని ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కె.కె.వి.బుల్లికృష్ణ అన్నారు. ఉమ్మడి జిల్లాలోని సంబంధిత అధికారులతో సామాజికంగా వెనుకబడిన, అనాథ బాలలకు ఆధార్ కార్డు రిజిస్ట్రేషన్, న్యాయసాధికారిత అనే అంశంపైన అవగాహన సదస్సును జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కార్యదర్శి బులి కృష్ణ మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో కమిటీ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆదివారం జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా సంబంధిత అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అధికారిని శారద, ఏలూరు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సూర్యచక్రవేణి, పశ్చిమ గోదావరి జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాజేష్, డీఎం అండ్ హెచ్‌వో నోడల్ ఆఫీసర్ డాక్టర్ నరేంద్ర, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మాధవి ఆత్మహత్యకు కారకులను అరెస్టు చేయాలి



ఆందోళన చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఏలూరు క్రైం, మే 24(ఆంధ్రజ్యోతి) : తుంపాల మాధవి ఆత్మహత్యకు కారకులైన సంతోశ్ తల్లిదండ్రులైన గద్దం నూకరాజు ఆయన భార్య బాప్పీబాలను అరెస్టు చేయాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఏలూరులో ప్రదర్శన నిర్వహించారు. ఏలూరుకు చెందిన తుంపాల మాధవి(19) గద్దం సంతోశ్ ప్రేమ పేరుతో నమ్మించి మోసగించడంతో ఇటీవల ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. ఈ కేసులో సంతోశ్‌తో పాటు అతని తల్లిదండ్రులను కూడా అరెస్టు చేయాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం వన్‌టౌన్‌లోని హమాలీలు ర్యాలీ నిర్వహించారు. రూరల్ ఎస్ఐ దుర్గా ప్రసాద్ హామీతో ర్యాలీ విరమించారు. ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఐఎఫ్‌టీయూ నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, తుంపాల మాధవి తుంపాల మాధవి తల్లిదండ్రులైన శివనాగరాజు, కనకమహాలక్ష్మి, తుంపాల మౌనిక, ముత్యాల దుర్గా ప్రసాద్, కోయిల వరలక్ష్మి, కోయిల సీత, కోయిల భవానీ, టి.దుర్గమ్మ పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమ పథకాలపై సమీక్ష


షరీఫ్‌కు ఆహ్వానం పలుకుతున్న కృపావరం

ఏలూరు రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీల వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు ఎం.ఎ.షరీఫ్ శనివారం ఏలూరులో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ముందుగా రెవెన్యూ అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు జిల్లా మైనార్టీల సంక్షేమఅధికారి ఎస్ఎస్ కృపావరం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం మైనారిటీల సంక్షేమ శాఖ ద్వారా ముస్లింల సంక్షేమానికి అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాల అమలుపై అధికారులతో సమీక్షించారు. అనంతరం తంగెళ్లమూడి మర్కజ్ మసీదు కువెళ్లి నమాజ్ చేశారు. అనంతరం తాడేపల్లికి తిరిగివెళ్లారు. కార్యక్రమంలో పలు ముస్లీం సంఘాల నేతలు పాల్గొన్నారు.


కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించండి

వేసవి శిబిరాల్లో విద్యార్థులకు వక్తల సూచన


ఏలూరులో వేసవి శిక్షణ శిబిరానికి హాజరైన విద్యార్థులు

ఏలూరు టూటౌన్/ పెదపాడు/ టి.నర్సాపురం/ పెదవేగి, మే 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని రిసోర్స్ పర్సన్ ఐ.శ్రీనివాసరావు అన్నారు. ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు వినోదభరితంగా జరుగుతున్నాయి. రిసోర్స్ పర్సన్ శ్రీనివాసరావు విద్యార్థులకు పుస్తకపఠనం చేయించి రకరకాల నీతికథలు చదివించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ అనూరాధ, డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణ రావు, రమేశ్, ఎండీ అస్లాంపాషా, కనకదుర్గ పాల్గొన్నారు. పెదపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించినట్టు గ్రంథాలయాధికారి దుగ్గిపోగు జాన్‌బాబు తెలిపారు. తొలుత విద్యార్థులకు ప్రముఖ వ్యక్తులు రచించిన నీతి కథలు వివరించి, అందులో మంచి లక్షణాలను కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. టి.నర్సాపురం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా గ్రంథపాలకులు ఆర్.కిశోర్ ఆధ్వర్యంలో శనివారం చెస్ పోటీలు నిర్వహించారు. పెదవేగి శాఖ గ్రంథాలయంలో గ్రంథపాలకుడు తోట అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆటపాటలతో గడిపారు.

యాదవులకు టీడీపీ పెద్ద పీట


సమావేశంలో మాట్లాడుతున్న యాదవ సంఘ సభ్యులు

ఏలూరు రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో యాదవ సామాజికవర్గ అభివృద్ధికి టీడీపీ పెద్ద పీట వేసిందని సంఘ నాయకులు పేర్కొన్నారు. శనివారం జిల్లా యాదవ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాదవ యువ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కాట్రు బాలు, యాదవ సంఘం గౌరవాధ్యక్షుడు ఇసుకపల్లి తాతారావు, ఉక్కుసూరి గోపాలకృష్ణ, వందనాల దుర్గాభవాని, శ్రీనివాస్, ఇప్పిలి వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి టీడీపీ పెద్దపీట వేసిందన్నారు. జూన్ 2న యాడా చైర్మన్‌గా ప్రమాణస్వీకర మహోత్సవానికి యాదవులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నగర యాదవ సంఘం అధ్యక్షుడు మెరుగులమాల శ్రీనివాస్, చిన్ను శ్రీనివాసు, ఎం.పోతురాజు పాల్గొన్నారు.

30 వరకు సమైక్యతా యాత్రలు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రవి

ఏలూరు కార్పొరేషన్, మే 24(ఆంధ్రజ్యోతి) : మత సామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణకై సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ వరకు సమైక్యత యాత్రలు నిర్వహిస్తున్నామని సీపీఎం రాష్ట్ర నాయకులు బి.బలరాం పేర్కొన్నారు. సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఎం.నాగమణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన పర్యాటకులు 26మందికి సంతాపాన్ని తెలిపారు. దేశంలో జరిగిన ఉగ్రదాడికి వ్యతిరేకంగా మన సైన్యం చేసిన ఆపరేషన్ సిందూర్‌ను స్వాగతిస్తున్నామన్నారు. కాల్పుల విరమణ విషయంలో ట్రంప్ చెప్పినట్టు విని ప్రధాని మోదీ దేశ ప్రతిష్టకు భంగం కలిగించారని ఆరోపించారు. దేశ ప్రజల ఐక్యత, మత సామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణకై ఈ నెల 30వ తేదీ వరకు జరిగే సమైక్యత యాత్రలో ప్రజలు పాల్గొని పిలుపునిచ్చారు.సమావేశంలో సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీపీఎం నాయకులు డి.ఎన్.వి.డి. ప్రసాద్, ఆర్.లింగరాజు, టి.రామకృష్ణ, జి.రాజు, పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్, ఎం.సుధారాణి, ఎం.జీవరత్నం, జి.నరసింహారావు, ఎ.ఫ్రాన్సిస్, ఎన్.హనుమాన్, టి.దుర్గారావు, ఎం.మంగరాజు, ఎన్.రమణారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టి.నర్సాపురం, మే24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని జంగారెడ్డిగూడెం ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజనీర్ శ్రీపీర్ అహ్మద్ ఖాన్ శనివారం తెలిపారు. ఆదివారం నక్కినవారిగూడెం సబ్‌సెక్షన్ పరిధిలో 11కేవీ ఫీడర్‌లో కొత్తలైన్ల ఏర్పాటును పురస్కరించుకుని సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

లింగపాలెం మండలంలో..

లింగపాలెం, మే 24(ఆంధ్రజ్యోతి) : మండలంలో ధర్మాజీగూడెం, ఆసన్నగూడెం, రంగాపురం సబ్ స్టేషన్‌ల పరిధిలో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో కొత్తగా విద్యుత్ లైన్లు, మరమ్మతుల కారణంగా ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముగ్గురికి పెదవేగి గురుకులంలో సీట్లు


చిన్నారులతో హెచ్ఎం

ద్వారకాతిరుమల, మే24(ఆంధ్రజ్యోతి) : శరభాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులకు అంబేడ్కర్ గురుకులంలో సీట్లు వచ్చినట్టు హెచ్ఎం సలగాలరాజు తెలిపారు. పెదవేగి గురుకులంలో సీట్లు సాధించిన సీట్లు సాధించిన దాసరి లోకేశ్, కాకరాల ఎనోష్, పెట్ల శ్రీజన్‌లను ద్వారకాతిరుమల ఎంఈవోలు అభినందించారు.

దుర్వాసనపై చర్యలు తీసుకోండి



బుట్టాయగూడెం, మే 24(ఆంధ్రజ్యోతి) : బుట్టాయగూడెం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న చికెన్ దుకాణాల నుంచి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలంటూ శని వారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ పి.వి. చలపతిరావుకు వినతిపత్రం అందజేశారు. కేవీపీఎస్ జిల్లా కా ర్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ గిరిజనులకు కేటాయించిన పంచాయతీ షాపుల్లో గిరిజనేతరులు చికెన్ వ్యాపారం చేస్తూ ప్రజల ఇబ్బందులను పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు అతి సమీపంలో ఉన్న చికెన్ దుకాణదారులు వ్యర్థాలను డ్రెయినేజీల్లో వేయడంతో నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోందని, అందుకే ఈ చికెన్ షాపులను వేరే చోటుకు తరలించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దారా శిఖామణి, అమర్తల ఏసుపాదం పాల్గొన్నారు.

కామయ్యపాలెంలో రంగా విగ్రహావిష్కరణ

జీలుగుమిల్లి, మే 24(ఆంధ్రజ్యోతి) : కామయ్యపాలెం గ్రామస్థులు ఏర్పాటు చేసిన వంగవీటి రంగా విగ్రహాన్ని శనివారం రాత్రి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచి నాయకులుగా గుర్తింపు పొందిన వారికి రాజకీయ రంగులు అంటించవద్దన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యాదర్శి గడ్డమణుగు రవికుమార్, కరాటం ఉమ, జనసేన మండల పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చంటికి రేషన్ డీలర్ల కృతజ్ఞతలు

ఏలూరు టూటౌన్, మే24(ఆంధ్రజ్యోతి) : రేషన్ డీలర్ల వ్యవస్థను పునరుద్ధరించడంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డీలర్లు శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాహనాల ద్వారా రేషన్ సప్లై చేసే విధానానికి ప్రభుత్వం స్వస్తి పలకడంతో డీలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఈడా చైర్మన్ శివప్రసాద్, ఆర్.గంగాధరరావు, కొల్లేపల్లి రాజు పాల్గొన్నారు.


పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు

సింగగూడెంలో పోలీసుల పల్లెనిద్ర

లింగపాలెం, మే 24(ఆంధ్రజ్యోతి) : ప్రజలతో మమేకమవ్వాలనే ఉద్దేశంతో పోలీసులు పల్లెనిద్ర చేపట్టారు. ఈ మేరకు మండలంలో సింగగూడెంలో ధర్మాజీగూడెం పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా శాంతిభద్రతలు, నేరాలపై శనివారం అవగాహన కల్పించారు.సీఐ సి.హెచ్.రాజశేఖర్ పాల్గొని గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని, ముఖ్యంగా యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.వెంకన్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్ఆర్ సెమిస్టర్ ఫలితాల విడుదల

ఏలూరు అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి) : సీఆర్ఆర్ అటానమస్ కళాశాల డిగ్రీ(2024-25) ప్రథమ సంవత్సరం రెండో సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం నాల్గవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శనివారం విడుదల చేశారు. ఫలితాలను కళాశాల వెబ్‌సైట్ నుంచి తెలుసుకోవచ్చని కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్ తెలిపారు. రీవాల్యూయేషన్‌కు ఈ నెల 27నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

పోలవరంలో వాన

పోలవరం, మే24(ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో పోలవరం మండలంలో శనివారం ఉదయం పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసింది. గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, ప్రగడపల్లి, ఎల్.ఎం.డీ.పేట, ఇటుకలకోట, వింజరం, కోంద్రుకోట గ్రామాల్లో వర్షం కురిసింది. వర్షం కారణంగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడ్డారు. మరోవైపు పట్టిసీమ ఎత్తిపోతల పథకం సమీపంలో రైతులు ఆరబెట్టిన మొక్కజొన్న పంట తడిసింది.

ధర్మాజీగూడెంలో వాహనాల తనిఖీ

లింగపాలెం, మే 24(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలు, లైసెన్సును కలిగి ఉండాలని ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న అన్నారు. మండలంలో ధర్మాజీగూడెంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు పలు సూచనలు చేశారు. వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తగా ఉండాలని హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపకూడదని, ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని, వారి లైసెన్సు రద్దుచేస్తామని హెచ్చరించారు. అలాగే సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు.

10వ రోజుకు ఆదివాసీల దీక్షలు

బుట్టాయగూడెం, మే 24(ఆంధ్రజ్యోతి) : గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాలని, ఏజెన్సీకి ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని, షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీలు మండల కేంద్రంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 10వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో మోసం కన్నపరాజు, తెల్లం శ్రీను, పూసం శ్రీను, కుంజా ముత్యాలరావు, తెల్లం భీమరాజు, సోదెం ముక్కయ్య, రవ్వ బసవరాజు పాల్గొన్నారు. దీక్షలను ఏటీఏ గౌరవ సలహాదారు సోదెం రాజు ప్రారంభించారు.

శ్రీవారికి ప్రత్యేక అర్చనలు



ఏలూరు కార్పొరేషన్, మే 24(ఆంధ్రజ్యోతి) : వైశాఖ బహుళ ద్వాదశి సందర్భంగా శనివారం స్థానిక రామచంద్రరావు పేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిళాంబి మారుతి శ్రీనివాస రామానుజాచార్యులు భక్తులతో, వారి గోత్రనామాలతో అర్చనలు జరిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష్‌కుమార్, సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

కిసాన్ మోర్చాను బలోపేతం చేయాలి

ఏలూరు రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి) : కిసాన్ మోర్చాను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి పిలుపునిచ్చారు. శనివారం ఏలూరు జిల్లా బీజేపీ కార్యాలయంలో కిసాన్ మోర్చా ఏలూరు జిల్లా అధ్యక్షులు కీర్తి రామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో కిసాన్ మోర్చా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ రానున్న 30 రోజుల్లో కిసాన్ మోర్చా నియామకాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సి.హెచ్.విక్రమ్ కిశోర్, కట్నేని కృష్ణప్రసాద్, పెన్మెత్స రామచంద్రరాజు, పాకలపాటి రవిరాజు, రాయంకుల చక్రధరరావు, ఉండపల్లి వెంకట్రావు, మేకల కృష్ణదేవరాయులు పాల్గొన్నారు.


గూటాల సచివాలయంలో అధికారులు

సచివాలయాల్లో తనిఖీలు

పోలవరం, మే 24(ఆంధ్రజ్యోతి) : మండలంలో సచివాలయాలను ఎంపీడీవో చెరుకూరి శ్రీనివాస్‌బాబు శనివారం తనిఖీ చేశారు. పోలవరం సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ సర్వే పనితీరును పరిశీలించారు. గూటాల సచివాలయంలో పలు సర్వేల నిర్వహణ విషయంలో ఎంపీడీవో సిబ్బందికి పలు సూచనలు చేశారు. కొత్తపట్టిసీమ, పట్టిసీమ గ్రామాల్లో ఆధార్ అప్‌డేట్, పారిశుధ్య నిర్వహణ, పంచాయతీ రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై తనిఖీలు నిర్వహించి కార్యదర్శులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

విద్యార్థి అమర్‌తేజ్‌కు అభినందన

పెదవేగి, మే 24(ఆంధ్రజ్యోతి) : అమ్మపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి పూర్తిచేసిన మెడంకి అమర్ తేజ్‌కు గొప్ప అవకాశం దక్కింది. అమ్మపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుడిమెల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కలికిరిలోని సైనిక్ స్కూల్లో చేరేందుకు అమర్ తేజ్‌కు అవకాశం వచ్చిందన్నారు. దీంతో ఎంఈవోలు విద్యార్థిని అభినందించారు.

జీవో నెం.4 రద్దు చేయాలని వీఆర్వోల వినతి

నూజివీడు టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): క్లస్టర్ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని కోరుతూ నూజివీడు వీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. నూజివీడు మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు గంటికోట వీరయ్య ఆధ్వర్యంలో వీఆర్వోలు జీవో నం.4ను తక్షణం రద్దు చేయాలని తహసీల్దార్ భద్రుకు వినతిపత్రాన్ని అందించారు.

నూజివీడులో 10.6 మిల్లీమీటర్ల వర్షపాతం

నూజివీడు టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో నూజివీడు మండలంలో 10.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నియోజకవర్గం వ్యాప్తంగా నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండగా ఆగిరిపల్లి మండలంలో అత్యధికంగా 30.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, నూజివీడు మండలంలో 10.6, చాట్రాయి మండలంలో 5.2, ముసునూరు మండలంలో అత్యల్పంగా 4.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

28 నుంచి నూజివీడు ట్రిపుల్ ఐటీలో స్పెషల్ కేటగిరీ విద్యార్థులకు కౌన్సెలింగ్



నూజివీడు టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా నూజివీడులోని రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌లో అడ్మిషన్లకు సంబంధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం 28వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ ఎస్. అమరేంద్రకుమార్ తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో క్యాప్, పీహెచ్, ఎన్‌సీసీ స్పోర్ట్స్, తదితర స్పెషల్ కేటగిరీ కి సంబంధించిన ఈ నెల 28వ తేదీ నుంచి 31 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.



పల్లెనిద్రలో స్థానికులతో మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణ

అంకితభావంతో ప్రజాసేవ : ఎస్ఐ

చాట్రాయి, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రజాసేవకు పోలీసులు నిరంతరం అంకితభావంతో పనిచేస్తున్నారని ఎస్ఐ డి. రామకృష్ణ అన్నారు. మండలంలోని సోమవరం గ్రామంలో శుక్రవారం రాత్రి పోలీసులు పల్లెనిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఎస్ఐ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్లు అందరూ వినియోగించుకోవాలని, అత్యవసర పోలీస్, అంబులెన్స్, అగ్నిమాపక సేవల కోసం డయల్ 112, మత్తు పదార్థాల నివారణకు డయల్ 1972, సైబర్ నేరాల నివారణకు 1930కు ఫోన్ చెయ్యాలన్నారు. రహదారి భద్రత విషయంలో ప్రతి ఒక్కరు బాధ్యతతో వ్యవహరించాలని హెల్మెట్ వినియోగం, డ్రంకెన్ డ్రైవ్ నివారణ, ట్రాఫిక్ నియమాల గురించి వివరించారు. సెలవుల్లో పిల్లలు చెరువులు, కుంటల వద్దకు ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు నిఘా పెట్టాలన్నారు. వర్షాకాలంలో రైతులు విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పనులు చేసేటప్పుడు రక్షణగా తొడుగులు, బూట్లు వాడాలన్నారు. గ్రామంలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే డయల్ 112, లేదా సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని, ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. స్థానిక నాయకుడు రాంప్రసాద్ పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి : కామినేని

కైకలూరు, మే 24(ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం వడాలిపేట ముస్లింలు కైకలూరు పెద్ద మసీదు, చిన్న మసీదు ముస్లిం పెద్దలు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. కైకలూరులో ముస్లిం శ్మశాన వాటికకు ప్రహరీ గోడ శిథిలావస్థలో ఉందని దానిని పునర్నిర్మించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముస్లిం మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎండీ ఫరూక్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తానన్నారు. మత పెద్దలు పాల్గొన్నారు.



కోరుకొల్లు గ్రామ కమిటీని అభినందిస్తున్న కూటమి నేతలు

కోరుకొల్లు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా చెన్నంశెట్టి


కలిదిండి, మే 24 (ఆంధ్రజ్యోతి): కోరుకొల్లు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా చెన్నంశెట్టి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం కోరుకొల్లులో జరిగిన టీడీపీ సమావేశంలో గ్రామ టీడీపీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బొమ్మిడి సింహాచలం, ప్రధాన కార్యదర్శిగా నల్లిబోయిన భోగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ, టీడీపీ సీనియర్ నాయకులు వలవల వెంకట రామారావు, కైకలూరు నియోజకవర్గ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి నున్న సుబ్రహ్మణ్యం, ఆత్మ మాజీ చైర్మన్ చెన్నంశెట్టి శ్రీనివాస్, కూటమి నాయకులు గనిశెట్టి మూర్తి, శివరామ్, గోపాల్, యర్రంశెట్టి విజయ సారథి, బిరుదుగడ్డ కిరణ్, చిన్న కనయ్య నూతనంగా ఎన్నికయ్యారు.



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సత్కరిస్తున్న టీడీపీ నేతలు

కైకలూరు పట్టణ అధ్యక్షుడిగా వాసు

కైకలూరు,మే24(ఆంధ్రజ్యోతి): కైకలూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా పడమటి వాసు, ప్రధాన కార్యదర్శిగా రసూల్‌ఖాన్‌ను ఎన్నుకున్నట్టు మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథ్‌రాజు తెలిపారు. శనివారం కైకలూరులో నిర్వహించిన టీడీపీ మండల కమిటీ సమావేశంలో నూతన కమిటీలో ఎంపికలో భాగంగా వీరిని ఎన్నుకున్నట్టు తెలిపారు. రాస్నున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్ మాల్యాద్రి, తెలుగు యువత రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, మైనార్టీ నాయకులు ఎండీ ఉస్మాన్, ఎండీ బాబీ, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పి. రాధాకృష్ణ, ఎస్సీ సెల్ నాయకుడు వీరాజబ్బిరెడ్డి సుధ, పార్టీ నేతలు సయ్యద్ బాజీద్, బషీర్, మేగిడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను పోలీసులకు అందజేస్తున్న మంత్రి, దాత తదితరులు

సీసీ కెమెరాలు, సామగ్రి వితరణ

ముసునూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పెరుగుతున్న దొంగతనాలు, గొడవలను నియంత్రించేందుకు అవసరమైన సీసీ కెమెరాలు, సామగ్రిని దాత చల్లగాజుల ఏసోబు బహూకరించారు. సుమారు రూ. 60 వేలు విలువ గల ఈ సామగ్రిని శనివారం రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి చేతుల మీదుగా పోలీసులకు అందజేశారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఉండేలా అవసరమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, ప్రత్యేక నిఘాలో దొంగతనాలు, గొడవలకు చెక్ పెట్టాలని మంత్రి పోలీసులకు సూచించారు. దాత ఏసోబును మంత్రి అభినందించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు రంగు శ్రీనివాస్, జనసేన నాయకులు పోశం నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్‌గిరీ దక్కేదెవరికి?



నూజివీడు ఏఎంసీ ప్రవేశ ద్వారం

- నూజివీడు ఏఎంసీ చైర్మన్ రేసులో ముగ్గురు మహిళలు

నూజివీడు, మే 24 (ఆంధ్రజ్యోతి): నూజివీడు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ అధ్యక్ష పదవి భర్తీ కావాల్సి ఉంది. దీనిని ప్రభుత్వం ఎస్సీ మహిళకు కేటాయించింది. ఈ పదవి కోసం ఆగిరిపల్లి మండలం ఈదులగూడెంకు చెందిన ముల్లంగి జ్యోతి, ఆగిరిపల్లికి చెందిన ముల్లంగి విజిత, ముసునూరు మండలం నుంచి కొండేటి ఎస్తేరురాణి ఆశిస్తూ పార్టీకి దరఖాస్తు చేసుకున్నారు. ఈ ముగ్గురికి కొంత రాజకీయ నేపథ్యం ఉంది. ముల్లంగి జ్యోతికి ఆమె బాబాయ్ ఈదర గ్రామ సర్పంచ్‌గాను, కొండేటి ఎస్తేరు రాణికి ఆమె అత్త ముసునూరు సర్పంచ్‌గాను ఉండగా, ముల్లంగి విజిత భర్త టీడీపీ జిల్లా ఎస్‌సీసెల్‌గా పనిచేశారు. పోటీపడుతున్న వారికి పదవీ కాలాన్ని సమంగా పంచుతూ అనే విషయమై నియోజకవర్గం ఎమ్మెల్యే మంత్రి కొలుసు పార్థసారథి మల్లగుల్లాలు పడుతున్నారు. రెండు రోజుల క్రితం టీడీపీ రాష్ట్ర పార్టీ ఐవీఆర్‌ఎస్ ద్వారా ముల్లంగి జ్యోతి ఒక్క పేరుతోనే నియోజకవర్గం పార్టీ శ్రేణుల నుంచి అభిప్రాయ సేకరణ జరపటం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. ముగ్గురిని పిలిచి సమస్య పరిష్కారానికి ఏకాభిప్రాయంగా నియామకం జరుగుతుందా? అనే విషయంపై నియోజకవర్గం ఆసక్తికరంగా ఎదురుచూస్తోంది.

చాట్రాయి టీడీపీ అధ్యక్షులెవరో?

కిస్సా కుర్సీ కా..

- బీసీ సామాజిక వర్గం నుంచి ఐదుగురు, ఓసీ నుంచి ఒకరు పోటీ
- అభిప్రాయాలు సేకరించిన పరిశీలకుడు ఘంటా మురళి
- మంత్రిదే తుది నిర్ణయం అంటున్న ఆశావహులు

చాట్రాయి, మే 24(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండల అధ్యక్షుడి ఎంపికలో ఉత్కంఠ నెలకొంది. నూజివీడు టీడీపీ కార్యాలయంలో శనివారం పార్టీ పరిశీలకుడు, చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి గ్రామ నాయకుల నుంచి అభిప్రాయం సేకరించారు. ఈసారి బీసీల నుంచి పలగాని దుర్గారావు, కందుల కృష్ణ, ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, పానుగంటి కోటేశ్వరరావు, తల్లాడ శ్రీనివాసరావు, ఓసీ నుంచి బొట్లు లక్ష్మణరావు పోటీ పడుతున్నారు. అభ్యర్థులంతా సుదీర్ఘకాలం నుంచి తాము పార్టీకి అందించిన సేవలు, తాము నిర్వహించిన పదవుల గురించి మంత్రి పార్థసారథికి, పరిశీలకుడు ఘంటా మురళికి వివరించి, మండల అధ్యక్ష పదవికి తమను ఎంపిక చేయాలని అభ్యర్థించారు. తమలో ఎవరికి అధ్యక్ష పదవికి ఎంపిక చేసినా ఆమోదయోగ్యమే అని బీసీ అభ్యర్థులు 5 గురు అంగీకార పత్రం రాసి పరిశీలకుడికి అందజేయటం గమనార్హం. అందరి అభిప్రాయాలు సావధానంగా విన్న పరిశీలకుడు మురళి నివేదికను మంత్రి పార్థసారథికి, పార్టీ అధిష్ఠానానికి అందజేస్తానని, త్వరలో తుది నిర్ణయం వెలువడుతుందని అన్నారు.



చాట్రాయి టీడీపీ కార్యాలయం

డ్వాక్రా గ్రూపుల ఆర్థిక లావాదేవీలపై ఆరా



ముదినేపల్లిలోని వెలుగు కార్యాలయం

- దారిమళ్లిన రుణ వాయిదాల సొమ్ము
- బ్యాంక్ స్టేట్‌మెంట్లు తదితర అంశాలు పరిశీలిస్తున్న వెలుగు అధికారులు

ముదినేపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల రికార్డుల నిర్వహణ, సభ్యుల రుణాల చెల్లింపునకు సంబంధించిన బ్యాంక్ స్టేట్‌మెంట్లు ఇతర ఆర్థిక అంశాలు పరిశీలనపై వెలుగు అధికారులు దృష్టిపెట్టారు. ముఖ్యంగా సంఘ సభ్యులు తీసుకున్న రుణాలను తిరిగి బ్యాంక్‌లకు సకాలంలో చెల్లిస్తున్నారా లేదా అన్నది పరిశీలిస్తున్నారు. ముదినేపల్లి మండలంలో ఇటీవల కొన్ని సంఘాల్లో ఆర్థిక లావాదేవీల్లో అవకతవకలు బయట పడటంతో మండలంలోని అన్ని సంఘాల కార్యకలాపాల నిర్వహణపై స్థానిక వెలుగు అధికారులు ఆరా తీస్తున్నారు. నాలుగేళ్ల క్రితం అల్లూరు, గత రెండు సంవత్సరాల్లో రంగాపురం, పెనుమల్లిలోని కొన్ని స్వయం సహాయక సంఘాలకు సంబంధించి పలు అవకతవకలు బయట పడగా, తాజాగా గురజలోని ఓ సంఘంలో సభ్యులు బ్యాంకుకు చెల్లించాల్సిన రుణాల వాయిదాల సొమ్ము రూ. 13 లక్షలు దారి మళ్లినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ సొమ్మును ఆ సంఘ అధ్యక్షురాలు బ్యాంకులో గత మూడేళ్లుగా జమ చేయకుండా తన సొంతానికి వాడుకున్నట్లు బయట పడింది. ఈ పరిస్థితుల్లో మండల ఏపీఎం శ్రీనివాసరావు మండలంలోని సంఘాలకు సంబంధించిన బ్యాంక్ స్టేట్ మెంట్లను పరిశీలించారు. నాలుగు రోజులుగా కొన్ని బ్యాంకుల నుంచి తీసుకున్న స్టేట్ మెంట్లను పరిశీలించగా, ఇప్పటి వరకు మండలంలోని 14 స్వయం సహాయక సంఘాలు రెండు నుంచి ఆరు నెలలపాటు బ్యాంకులకు రుణాల చెల్లింపు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఆయా సంఘాల్లో రుణాల చెల్లింపుల్లో జాప్యం ఎందుకు జరిగింది, సభ్యులు సంఘ అధ్యక్షురాళ్లకు కానీ, బుక్ కీపర్ల కు గానీ వాయిదాల సొమ్ము ఇస్తే వారు బ్యాంక్‌లో జమ చేయలేదా అన్న అంశాలను పరిశీలిస్తున్నారు.

గురజలో రికవరీకి చర్యలు..

గురజలోని ఒక స్వయం సహాయక సంఘ సభ్యుల రుణాల వాయిదాల సొమ్మును బ్యాంకులో జమ చేయకుండా తాను వాడుకున్నట్లు ఆ సంఘ అధ్యక్షురాలు అంగీకరించారని, కొంత సొమ్మును బుక్ కీపర్‌కు కూడా ఇచ్చానని చెబుతున్నారని ఏపీఎం శ్రీనివాసరావు తెలిపారు. దీనిపై విచారించి సొమ్మును రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

ముసునూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.సీహెచ్ సూరిబాబు కోరారు. చెక్కపల్లి, గుడిపాడు, ముసునూరు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని శనివారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ మండలానికి జీలుగ 88 క్వింటాళ్లు, జనుము 98, పిల్లిపెసర 72 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయన్నారు. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ నెంబర్ లింక్ అయిన ఆధార్ కార్డు నకళ్లను తీసుకుని రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలను పొందాలన్నారు. రసాయన ఎరువుల వాడకం ఎక్కువ అవడంతో భూసారం తగ్గి పంటల దిగుబడి క్షీణిస్తోందన్నారు. పచ్చిరొట్ట ఎరువులతో భూమిలో నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి సేంద్రియ పోషకాలు పెంపొందుతాయన్నారు. ఏతపో రామకృష్ణ నాయక్, వీహెచ్ఏ సాత్విక, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు

ముదినేపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం ముదినేపల్లిలోని శ్రీ సువర్చలా సమేత భక్తాంజనేయస్వామి ఆలయంలో స్వామివార్లకు విశేష పూజలు నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పెద రామాలయంలో స్వామివార్లకు వడ్లస్తానం, వసంతోత్సవం నిర్వహించి ప్రదక్షిణలు జరిపారు. మామిడి పండ్లు సమర్పించి పూజలు జరిపారు. సంఘ నాయకులు మాదసు పూర్ణ, వత్సవాయి ప్రసాద్, కురిచేటి తిరుమల శ్రీనివాస్ తదితరుల ఆధ్వర్యంలో స్వామికి భక్తులు పూజలు చేశారు. ఉప్పరగూడెం వీరాంజనేయస్వామి ఆలయం వద్ద ఆలయ చైర్మన్ రెడ్డి నాగ రమేష్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. పెదగొన్నూరు, వాడపల్లి, శ్రీహరిపురం తదితర గ్రామాల్లోను హనుమజ్జయంతి వేడుకలు ముగిశాయి.

హుండీ ఆదాయం లెక్కింపు

చాట్రాయి, మే 24(ఆంధ్రజ్యోతి): ఆరుగొలను భద్రాద్రి చనుబండ కోదండ రామాలయంలో ఏడాది కాలానికి హుండీ ఆదాయం రూ. లక్షా 18 వేల 368 లభించినట్టు ఆలయ ధర్మకర్త ఘట్టమనేని చెన్నకేశవరెడ్డి తెలిపారు. శనివారం ఆలయంలో దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు, భక్తులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. చనుబండ కోదండ రామాలయం భూముల కౌలు వేలం శనివారం ఆలయ ఆవరణలో నిర్వహించగా రూ. 77 వేల ఆదాయం వచ్చినట్లు ధర్మకర్త చెన్నకేశవరెడ్డి తెలిపారు.

వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పిస్తాం

- సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మెరుగు ముక్కంటి



ఎక్స్‌కవేటర్‌తో పూడిక తీయిస్తున్న సర్పంచ్

డ్రెయినేజీల్లో పూడిక తొలగింపు

ఆగిరిపల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి పంచాయతీ పరిధిలోని డ్రెయినేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను శనివారం ఎంపీడీవో బి. ఆనందబాబు పర్యవేక్షణలో సర్పంచ్ చౌటపల్లి లక్ష్మీ విక్టర్‌బాబు ఆధ్వర్యంలో చేపట్టారు. పారిశుద్ధ్య పనుల్లో భాగంగా శోభనాపురం రోడ్‌లో మురుగు కాలువలో చెత్తను, పేరుకుపోయిన మట్టిని తీసి శుభ్రపరిచారు. చొప్పరమెట్ల రోడ్డులోని డంపింగ్ చెత్తను తీసి శుభ్రపరిచారు.

కైకలూరు, మే 24(ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి వసతి గృహాల్లో పూర్తి స్థాయిలో వసతులు కల్పిస్తామని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మెరుగు ముక్కంటి అన్నారు. శనివారం వైఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కైకలూరు, గణపవరం మండలాల్లోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్ల వార్డెన్లు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో వసతి లేని గృహాలు శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందిస్తూ జూన్ నెలలో ప్రారంభమయ్యే విద్యా సంవత్సరానికి పూర్తిస్థాయిలో వసతి గృహాల మరమ్మతులు పూర్తి చేస్తామని, అప్పటి వరకు సిబ్బంది ఎక్కడికక్కడే పర్యవేక్షిస్తారన్నారు. హాస్టల్ సచివాలయం వెల్ఫేర్ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుంచి విద్యార్థులకు అందించే పథకాలు వివరించి సంక్షేమ హాస్టల్లో 100 మంది విద్యార్థులు చేరేలా కృషి చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే విద్య, భోజనం, తల్లికి వందనం, వసతిదీవెన వంటి పథకాలను వివరించాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు తల్లికి వందనం పథకం కూడా అమలు చేస్తారని అన్నారు. హాస్టల్స్ మరమ్మతు లను నిర్వహించడం అనేక చోట్ల ఆదనంగా నాలుగు గదుల నిర్మాణాన్ని చేపడతామని, ఈ విద్యాసంవత్సరం ఆయాహాస్టల్లో తీసుకువచ్చి ప్రైవేట్ భవనాల్లో హాస్టల్స్ నడపకుండా చర్యలు తీసుకుం టామని అన్నారు. ఎఎస్‌డబ్ల్యూవో బి. వెంకటరత్నం, హాస్టల్ వార్డెన్లు ఎం. నాగమణి, కె. అనిత, సూరమ్మ, బి. శివ, అర్‌విఎస్ స్వామి, కె. నాగమణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ ముక్కంటి

'యువతకు ఆదర్శం అహల్యాబాయి'



అహల్యాబాయి జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు,మే 24(ఆంధ్రజ్యోతి): అహల్యాబాయి హోల్కర్ జీవిత చరిత్ర నేటి యువతకు ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్రీయ సంఘటన అధ్యక్షుడు నూకల మధుకర్ అన్నారు. శనివారం కైకలూరులో అహల్యాబాయి హోల్కర్ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 300 ఏళ్ల క్రితం అహల్యాబాయి భారత్‌ను పాలించారని, ఆమె జీవిత చరిత్ర నేటి యువతకు తెలియాలన్నారు. నూకల మధుకర్ మాట్లాడుతూ అహల్యాబాయి మహారాష్ట్రలో నిరుపేద కుటుంబం లో పుట్టిన ఆమెను రాజు మల్హర్‌రావు తన కోడలిగా స్వీకరించారన్నారు. 16వ శతాబ్దంలో ఆమె భర్త ఖండేరావు హోల్కర్ చనిపోతే సతీసహగమనం చేయల్సి ఉండగా రాజు మల్హర్‌రావు అడ్డుకున్నారన్నారు. ఆమె రాజ్య పరిపాలన చేపట్టి మధ్యప్రదేశ్‌ను కీలకంగా చేసుకుని పరిపాలన చేశారన్నారు. ఆమె పాలనలో దేశ సాంస్కృతిక వైభవం వెలుగొందిందని, 152 ఆలయాలు పునః నిర్మించారన్నారు. కాశీలో ఆమె విగ్రహాన్ని ప్రధాని ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా అహల్యాబాయి జీవిత చరిత్ర పుస్తకాలను ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎంపీపీ అడవి కృష్ణ, జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్‌కిషోర్, రాష్ట్ర నాయకులు నిర్మల కిషోర్, రాష్ట్రకార్యవర్గ సభ్యులు మాలతీరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, బీజేపీ నాయకులు కీర్తి వెంకటరామ్ ప్రసాద్, చిట్టూ రి నరేం ద్ర, బోడ వుల జగదీష్ పాల్గొన్నారు.

నూజివీడులో...

నూజివీడు టౌన్: స్ఫూర్తిదాయకమైన పాలన అందించిన మహిళా రాణి అహల్యా బాయి హోల్కర్ అని బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి విక్రమ్ కిషోర్ అన్నారు. శుక్రవారం రాత్రి నూజివీడులో అహల్యా బాయి 300 జయంతి కార్యక్రమాన్ని పట్టణ బీజేపీ అధ్యక్షురాలు మల్లిపూడి నాగరాణి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన విక్రమ్ కిషోర్ అహల్యాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడుతూ బ్రిటిష్ వారిని ధైర్యంగా ఎదుర్కొని యుద్ధంలో విజయం సాధించిన వీర వనితగా అభివర్ణించారు. ప్రధాన మోదీ పిలుపు మేరకు అహల్యా బాయి జీవిత చరిత్రను భారతీయులందరికి తెలియజేయాలని జయంతి కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి, బీజేపీ నాయకులు ఎన్.సత్యనారాయణ, అప్పారావు, రాజశేఖర్, ఎం. రవికాంత్, శివరాజు, పసుపులేటి దేవి, ఓలేటి మిని రాజా తదితరులు పాల్గొన్నారు.



నూజివీడులో..

దారి కాచిన మృత్యువు

- కారు ఢీకొని దివీస్ ఉద్యోగిని మృతి



తిరుమలదేవి (ఫైల్)

తగరపువలస, మే 24 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస జాతీయ రహదారిపై శనివారం ఉదయం కారు ఢీకొని యువతి మృతి చెందింది. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం నుంచి ఎర్రవారిగూడెం గ్రామానికి చెందిన ఉప్పలపాటి తిరుమలదేవి (25) రెండేళ్లుగా దివీస్ కంపెనీలో పీడీఎస్ విభాగంలో కెమిస్ట్‌గా పనిచేస్తోంది. ఆమె తల్లిదండ్రులు లక్ష్మీనారాయణరాజు, రమణి, సోదరి ఎర్రవానిగూడెంలో ఉంటారు. తిరుమలదేవి ఆదే కంపెనీలో పనిచేస్తున్న మరో ముగ్గురు యువతులతో కలిసి సంగివలస వద్ద అపార్టుమెంటులో అద్దెకు నివాసం ఉంటోంది. కుమార్తెను అంత దూరం ఉద్యోగానికి పంపించడానికి తల్లిదండ్రులు తొలుత ఒప్పుకోలేదు. తనలా ఉద్యోగం చేస్తున్న వారితో కలిసి ఉంటానని ఆమె చెప్పడంతో అంగీకరించారు. తిరుమలదేవి ఉద్యోగంలో కొందరు సొంత వాహనాల్లో విధు లకు వెళుతుండగా, మారికొందరు బస్సుల్లో వెళ్తుంటారు. తిరుమలదేవితో పాటు ఆమె రూమ్మేట్స్ ప్రతి రోజూ కంపెనీకి బస్సులో విధులకు వెళ్లి, వస్తుంటారు. శనివారం ఉదయం కూడా నలుగురు బస్సు కోసం సంగివలస కూడలికి వచ్చారు. వారు వచ్చేసరికి బస్సు వెళ్లిపోవడంతో డ్రైవర్‌కు ఫోన్ చేయగా, తాళ్లవలస నుంచి మళ్లీ వెనక్కి వస్తానని, అప్పటివరకు రోడ్డు దాటి ఉండాలని చెప్పాడు. ఈ మేరకు నలుగురు అవతల రోడ్డు నుంచి ఇవతల రోడ్డుకు వస్తుండగా విశాఖ పట్నం నుంచి శ్రీకాకు ళం వెళుతున్న కారు డ్రైవర్ పంక్చర్ కావడంతో డివైడర్‌ను ఢీకొట్టి ఇవతల వైపు రహదారిపైకి దూసుకువచ్చింది. ఆ సమయంలో రోడ్డు దాటుతున్న తిరుమలదేవిని బలంగా ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు సీఐ తిరుమలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఊటుకూరు డ్రెయిన్‌కు మోక్షం

- కిక్కిస తొలగింపు..
- ముంపు సమస్యకు తెర




ఊటుకూరు మీడియం డ్రెయిన్‌లో కిక్కిస (ఫైల్)

ముదినేపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలో వేలాది ఎకరాల ఆయకట్టుకు మురుగునీటి సౌకర్యం కల్పిస్తున్న ఊటుకూరు మీడియం డ్రెయిన్‌కు ఎట్టకేలకు అభివృద్ధికి నోచుకుంది. ఈ డ్రెయిన్‌లో దట్టంగా పెరిగి మురుగునీటి ప్రవాహానికి ఆటంకంగా ఉన్న కిక్కిస, తూటు, గుర్రపు డెక్కను తొలగించారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చొరవతో ఏర్పాటు చేసిన నిధుల నుంచి ఎక్స్‌కవేటర్‌తో వీటిని పూర్తిస్థాయిలో తొలగించారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.15 లక్షల వ్యయంతో సుమారు 6 కిలోమీటర్ల దూరం ఈ డ్రెయిన్‌లో చిక్కబడిన పెరిగిన కిక్కిస తొలగించడంతో సుమారు 9 వేల ఎకరాల ఆయకట్టుకు మురుగునీటి సమస్య పరిష్కారమైంది. డ్రెయి న్ దిగువ భాగంలో పేరుకుపోయిన కిక్కిస వల్ల సుమారు 3 వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం ఏర్పడేది. కిక్కిస తొలగింపుతో వరి సాగు భూములతోపాటు, సుమారు 3 వేల ఎకరాల చేపలు, రొయ్యల చెరువులకు కూడా ప్రయోజనం కలిగింది.



కిక్కిస తొలగించిన తర్వాత..

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(కు.లో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475